

# ప్రజాస్ఫూర్తి

PRAJASPOORTHI TELUGU DAILY

తెలుగు దినపత్రిక

PS NEWS

మేడ్చల్ - మల్కాజిగిరి | ఎడిటర్ - గడ్డమీది బాలరాజు | శనివారం 13-09-2025 | సంపుటి - 26 | సంచిక - 122 | రూ : 4 | పేజీలు: 8




## నేపాల్ లో భారతీయుల బస్సుపై దాడి

- ప్రయాణికులను దోచుకున్న దుండగులు
- పశుపతినాథ్ ఆలయం నుంచి తిరిగి వస్తుండగా ఘటన
- ఆర్మీ సాయంతో ప్రాణాలతో బయటపడ్డామన్న భక్తులు

2లో

## ఉపరాష్ట్రపతిగా సీపీ రాధాకృష్ణన్ ప్రమాణ స్వీకారం



2లో

- ప్రమాణం చేయించిన రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము
- హాజరైన ప్రధాని మోదీ, కేంద్ర మంత్రులు, ప్రముఖులు
- ఇటీవలి ఎన్నికల్లో జస్టిస్ సుదర్శన్ రెడ్డిపై గెలుపు
- మహారాష్ట్ర గవర్నర్ పదవికి నిన్ననే రాజీనామా
- ఆర్ఎస్ఎస్ నేపథ్యం నుంచి కీలక పదవికి ఎంపిక



2లో

## గోదావరి పుష్కరాలు 2027

ఇప్పటినుంచే తెలంగాణ ప్రభుత్వం ఫోకస్



2లో

## తెలంగాణలో పలు జిల్లాల్లో రెండు రోజుల పాటు అతి భారీ వర్షాలు



2లో

## కోల్ ఇండియా ఉద్యోగులకు కేంద్రం శుభవార్త..

# మెడికల్ కాలేజీలు ప్రైవేటీకరిస్తున్నారంటూ వైసీపీ ఆరోపణ... సీఎం క్లారిటీ

- మెడికల్ కాలేజీలపై జగన్ అబద్ధాలు చెబుతున్నారన్న చంద్రబాబు
- నిర్మించకుండానే నిర్మించామని ప్రచారం చేసుకున్నారని విమర్శ
- తాము అమలు చేసేది పీపీపీ విధానమేనని స్పష్టీకరణ
- కాలేజీల నిర్వహణ ప్రభుత్వానిదేనని హామీ
- బెదిరింపులకు భయపడేది లేదని తేల్చిచెప్పిన సీఎం



ఏపీలో మెడికల్ కాలేజీలు ప్రైవేటీకరిస్తున్నారంటూ వైసీపీ నేతలు చేస్తున్న ఆరోపణలపై సీఎం చంద్రబాబు స్పందించారు. తాము మెడికల్ కాలేజీలను ప్రైవేటు వ్యక్తులకు అప్పగించడం లేదని చంద్రబాబు స్పష్టం చేశారు. కేవలం పబ్లిక్‌ప్రైవేట్ పార్ట్‌నర్‌షిప్ (పీపీపీ) విధానంలోనే ముందుకు వెళుతున్నామని, దీనివల్ల ఎవరికీ అన్యాయం జరగదని హామీ ఇచ్చారు. నిర్వహణ బాధ్యతలు పూర్తిగా ప్రభుత్వానివే ఉంటాయని, వైద్య విద్యార్థులకు గానీ, రోగులకు గానీ ఎలాంటి ఇబ్బంది రానివ్వబోమని తేల్చి చెప్పారు. ఈ విషయంలో ఎవరు బెదిరించినా భయపడే పరిస్థితి లేదని, ప్రభుత్వం తన బాధ్యతలను సక్రమంగా నిర్వర్తిస్తుందని ఆయన అన్నారు. ఈ సందర్భంగా చంద్రబాబు వైసీపీ అధినేత జగన్ పై మండిపడ్డారు. మెడి[illegible]డానే, అన్నీ

తరువాయి 2లో

# భారత్‌లో లక్షల ఉద్యోగాలు గల్లంతు

ట్రంప్ అధిక టారిఫ్‌పై శశిథరూర్ తీవ్ర ఆగ్రహం

- ట్రంప్ నిర్ణయంతో సూరత్ వజ్రాల పరిశ్రమలో లక్షకు పైగా ఉద్యోగాలు పోయాయని ఆరోపణ
- ఇది సుంకం కాదు, రష్యా నుంచి చమురు కొంటున్నందుకు విధించిన కక్షపూరిత ఆంక్షలని వ్యాఖ్య
- మనకన్నా ఎక్కువ చమురు కొంటున్న చైనాపై చర్యలు లేవని, ఇది అన్యాయమని వ్యాఖ్య
- ట్రంప్ విచిత్రమైన వ్యక్తి అని, ఆయన విధానాలు అర్థరహితంగా ఉన్నాయని థరూర్ విశ్లేషణ



2లో

# 2034 నాటికి ఏపీ ఎలా ఉండబోతోందనే అంశాన్ని ఆవిష్కరించిన చంద్రబాబు

- వే2న్యూస్ కాంక్లేవ్‌లో పాల్గొన్న ముఖ్యమంత్రి చంద్రబాబు
- ఆంధ్రప్రదేశ్ భవిష్యత్‌పై ప్రణాళిక ఆవిష్కరణ
- 2034 నాటికి రూ. 57 లక్షల కోట్ల జీఎస్‌డీపీ సాధనే లక్ష్యం
- ప్రతి వ్యక్తి తలసరి ఆదాయం రూ. 10 లక్షలు దాటించడమే టార్గెట్
- సూపర్ సిక్స్‌తో సంక్షేమం, ప్రణాళికలతో అభివృద్ధికి సమ ప్రాధాన్యం



2లో

# భారత్‌లో లక్షల ఉద్యోగాలు గల్లంతు: ట్రంప్ అధిక టారిఫ్‌పై శశిథరూర్ తీవ్ర ఆగ్రహం

**అమెరికా, సెప్టెంబర్ 12:** అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ తీసుకుంటున్న అసాధారణ నిర్ణయాలు భారత్‌పై తీవ్ర ప్రభావం చూపుతున్నాయని కాంగ్రెస్ సీనియర్ నేత శశి థరూర్ ఆవేదన వ్యక్తం చేశారు. రష్యా నుంచి భారత్ చమురు కొనుగోలు చేస్తున్న కారణంతో భారత వస్తువులపై 50 శాతం సుంకాలు విధించాలన్న ట్రంప్ నిర్ణయం దిగ్భ్రాంతికరమని అన్నారు. ఈ చర్య వల్ల ఇప్పటికే సూరత్‌లోని వజ్రాలు, ఆభరణాల పరిశ్రమతో పాటు సముద్ర ఉత్పత్తులు, తయారీ రంగాల్లో లక్షకు పైగా ఉద్యోగాలు పోయాయని ఆయన ఆరోపించారు. సముద్రపు ఆహారం, తయారీ రంగంలోనూ ఈ ప్రభావం కనిపిస్తోందని తెలిపారు. టారిఫ్‌ల ప్రభావం భారత ఆర్థిక వ్యవస్థను దెబ్బతీస్తుందని వాపోయారు. సింగపూర్‌లో జరిగిన ఒక రియల్ ఎస్టేట్ సదస్సులో భారత్ అమెరికా సంబంధాలపై అడిగిన ప్రశ్నకు ఆయన స్పందిస్తూ, "ట్రంప్ చాలా చిత్రమైన వ్యక్తి. అమెరికా అధ్యక్షుడికి ఆ దేశ వ్యవస్థ అపరిమితమైన స్వేచ్ఛను ఇస్తుంది. ఆయన నిర్ణయాల వల్ల భారత ఎగుమతిదారులు తీవ్రంగా నష్టపోతున్నారు" అని ఆయన తెలిపారు. ట్రంప్ కంటే ముందు 44 లేదా 45 మంది అధ్యక్షులుగా పనిచేసినప్పటికీ వైట్ హౌస్ నుంచి ఈ రకమైన ప్రవర్తన ఎన్నడూ చూడలేదని ఆయన అన్నారు. సంప్రదాయ దౌత్య ప్రమాణాలను ట్రంప్ గౌరవించడం లేదని విమర్శించారు. భారత్‌పై విధించిన 50 శాతం సుంకంలో, రష్యా నుంచి చమురు కొనుగోలు చేసినందుకు అదనంగా 25 శాతం పెనాల్టీ కూడా ఉందని శశిథరూర్ వివరించారు. "ఇది పన్ను కాదు, ఇది కచ్చితంగా మనపై విధించిన ఆంక్షలు. ఇది పూర్తిగా అన్యాయం. ఎందుకంటే మనకంటే చైనానే రష్యా నుంచి ఎక్కువ చమురు, గ్యాస్ దిగుమతి చేసుకుంటోంది. కానీ వారిపై ఇలాంటి చర్యలు లేవు. రష్యా నుంచి చమురు కొనే అన్ని దేశాలపై ఒకే రకమైన విధానం అమలు చేయాలి కదా?" అని ఆయన ప్రశ్నించారు. ట్రంప్ వైఖరిని ఎండగడుతూ, "తనకు నోబెల్ శాంతి బహుమతి రావాలని ఒక ప్రపంచ నేత బహిరంగంగా చెప్పడం మీరెప్పుడైనా విన్నారా? చరిత్రలో ఇలా ఎప్పుడూ జరగలేదు" అని శశిథరూర్ అన్నారు. భారత్, రష్యా దేశాలవి డెడ్ ఎకానమీలు అని చెప్పడం ఎప్పుడైనా విన్నారా? ఒక దేశాధ్యక్షుడి నుంచి వినిపించకూడని భాష ఇది అని ఆయన అన్నారు. అమెరికా మార్కెట్‌లోకి ప్రవేశించడం మనకు చాలా కష్టంగా మారిందని, అయినప్పటికీ చర్చలు జరుగుతున్నాయని, వాటిపై ఆశాభావంతో ఉన్నామని తెలిపారు. ఈ పరిస్థితుల్లో భారత్ కేవలం అమెరికాపైనే ఆధారపడకుండా తన దౌత్య, ఆర్థిక సంబంధాలను ఇతర దేశాలతో విస్తరించుకోవాలని ఆయన సూచించారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఇటీవల చైనాలో జరిగిన షాంఘై సహకార సంస్థ సమావేశానికి వెళ్లడం, రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్ త్వరలో భారత్‌లో పర్యటించనుండటం వంటి పరిణామాలు ఈ దిశగా జరుగుతున్న ప్రయత్నాలకు నిదర్శనమని ఆయన పేర్కొన్నారు. అమెరికా ఆంక్షల విధానం వింతగా, సమర్థించుకోలేని విధంగా ఉందని ఆయన అభిప్రాయపడ్డారు.

## తెలంగాణలో పలు జిల్లాల్లో
# రెండు రోజుల పాటు అతి భారీ వర్షా లు

**హైదరాబాద్, సెప్టెంబర్ 12 :** తెలంగాణలో రానున్న రెండు రోజుల్లో భారీ నుంచి అతి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం వెల్లడించింది. ఉపరితల ఆవర్తన ప్రభావంతో బంగాళాఖాతంలో అల్పపీడనం ఏర్పడిందని, దీని ప్రభావంతో పలు జిల్లాల్లో శుక్ర, శనివారాల్లో అతి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని తెలిపింది. ఆదివారం మరికొన్ని జిల్లాల్లో అక్కడక్కడా వర్షాలు కురిసే అవకాశముందని వాతావరణ కేంద్రం పేర్కొంది. ఈ రోజు ఆదిలాబాద్, కొమురంభీమ్ ఆసిఫాబాద్, మహబూబాబాద్, భద్రాద్రి కొత్తగూడెం, సూర్యాపేట, ఖమ్మం జిల్లాల్లో అతిభారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని తెలిపింది. ఈ జిల్లాలకు ఆరెంజ్ హెచ్చరిక జారీ చేసింది. శనివారం నిర్మల్, నిజామాబాద్, కామారెడ్డి, మెదక్, సంగారెడ్డి జిల్లాల్లో అతి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని పేర్కొంది. ఈ సమయంలో గంటకు 30 నుండి 40 కిలోమీటర్ల వేగంతో గాలులు వీచే అవకాశం ఉందని పేర్కొంది.

# కోల్ ఇండియా ఉద్యోగులకు కేంద్రం శుభవార్త.. కిషన్ రెడ్డి కీలక ప్రకటన

**హైదరాబాద్, సెప్టెంబర్ 12:** బొగ్గు గనుల్లో పనిచేసే కార్మికుల సంక్షేమం కోసం కేంద్ర ప్రభుత్వం పలు కీలక నిర్ణయాలు తీసుకుంది. కోల్ ఇండియాలో పని చేస్తున్న రెగ్యులర్, కాంట్రాక్ట్ ఉద్యోగులకు భారీ ప్రయోజనాలు కల్పిస్తూ కేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రి కిషన్ రెడ్డి శుక్రవారం కీలక ప్రకటన చేశారు. ఇందులో భాగంగా రెగ్యులర్ ఉద్యోగులకు కోటి రూపాయల అదనపు బీమా కవరేజీతో పాటు, స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత మొదటిసారిగా కార్మికులు, అధికారులందరికీ ఒకేరకమైన డ్రెస్ కోడ్ ప్రవేశపెట్టనున్నట్లు ఆయన తెలిపారు. రాంచీలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో కిషన్ రెడ్డి మాట్లాడుతూ, ప్రధానమంత్రి నరేంద్ర మోదీ పుట్టినరోజు, విశ్వకర్మ పూజను పురస్కరించుకుని ఈ సెప్టెంబర్ 17వ తేదీ నుంచి ఈ కొత్త పథకాలు అమల్లోకి వస్తాయని ఆయన స్పష్టం చేశారు. కొత్త నిబంధనల ప్రకారం, కోల్ ఇండియాలోని రెగ్యులర్ ఉద్యోగులకు కోటి రూపాయల అదనపు బీమా లభిస్తుందని, కాంట్రాక్ట్ కార్మికులకు రూ. 40 లక్షల వరకు బీమా వర్తిస్తుందని వివరించారు. దీంతో పాటు, రెగ్యులర్ ఉద్యోగులకు ఇచ్చే ఎక్స్‌గ్రేషియా మొత్తాన్ని రూ. 15 లక్షల నుంచి రూ. 25 లక్షలకు పెంచుతున్నట్లు ప్రకటించారు. ఉద్యోగులకు గౌరవప్రదమైన గుర్తింపు ఇవ్వాలనే లక్ష్యంతో దేశంలోని అన్ని బొగ్గు గనుల్లో ఒకేరకమైన డ్రెస్ కోడ్ తీసుకువస్తున్నామని కిషన్ రెడ్డి అన్నారు. ఈ యూనిఫామ్‌లను కోల్ ఇండియా సంస్థే అందిస్తుందని, ఇది అధికారులకు కూడా వర్తిస్తుందని ఆయన పేర్కొన్నారు. మోదీ ప్రభుత్వ హయాంలో బొగ్గు రంగం గణనీయమైన అభివృద్ధి సాధించిందని మంత్రి తెలిపారు. దేశంలో బొగ్గు ఉత్పత్తి మొదటిసారిగా ఒక బిలియన్ టన్నులు దాటిందని, దిగుమతులు తగ్గించుకోవడం ద్వారా గత ఆర్థిక సంవత్సరంలో రూ. 60,000 కోట్ల విదేశీ మారక ద్రవ్యాన్ని ఆదా చేశామని చెప్పారు. ప్రభుత్వం కేవలం బొగ్గుపైనే కాకుండా, కీలక




ఖనిజాల అన్వేషణపై కూడా దృష్టి సారించిందని, ఇందుకోసం రూ. 32,000 కోట్లతో 'నేషనల్ క్రిటికల్ మినరల్స్ మిషన్' ప్రారంభించినట్లు ఆయన గుర్తుచేశారు. దేశంలో 74 శాతం విద్యుత్ థర్మల్ పవర్ నుంచే ఉత్పత్తి అవుతున్నందున, ఇంధన భద్రతకు ప్రభుత్వం అత్యధిక ప్రాధాన్యత ఇస్తుందని ఆయన స్పష్టం చేశారు.

# నేపాల్ లో భారతీయుల బస్సుపై దాడి

నేపాల్, సెప్టెంబర్ 12 : నేపాల్ లోని పశుపతినాథ్ ఆలయ దర్శనానికి వెళ్లిన భారతీయులపై దాడి జరిగింది. వారు ప్రయాణిస్తున్న బస్సుపై దుండగులు దాడి చేశారు. బస్సులోని ప్రయాణికులను బెదిరించి నగదు, నగలు, సెల్ ఫోన్లు సహా విలువైన వస్తువులను ఎత్తుకెళ్లారు. కాసేపటికి నేపాల్ ఆర్మీ వచ్చి తమను కాపాడిందని, భారత ప్రభుత్వం ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయడంతో స్వస్థలాలకు చేరుకున్నామని భక్తులు తెలిపారు. యూపీకి చెందిన ఈ టూరిస్టు బస్సుకు ఆంధ్రప్రదేశ్ కు చెందిన రాజ్ డ్రైవర్ గా వ్యవహరిస్తున్నారు. ఈ దోపిడీ ఘటనను రాజ్ మీడియాకు వివరిస్తూ.. పశుపతినాథ్ ఆలయం నుంచి తిరిగి వస్తుండగా ఒక దొంగల ముఠా బస్సును అడ్డగించిందని, బస్సు అద్దాలను ధ్వంసం చేసి ప్రయాణికులను బెదిరించిందని చెప్పారు. తమ వద్ద ఉన్న నగదు, నగలు, విలువైన వస్తువుల తో పాటు బ్యాగులను కూడా ఎత్తుకెళ్లారని ఆయన వివరించారు. దొంగలు పలువురు ప్రయాణికులపై దాడికి పాల్పడ్డారని బాధితులు తెలిపారు. ఆ తర్వాత కాసేపటికి నేపాల్ సైనికులు వచ్చి తమకు సహాయం చేశారని, భారత ప్రభుత్వం ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయడంతో తాము సురక్షితంగా సరిహద్దులు దాటామని వారు పేర్కొన్నారు.

# 2034 నాటికి ఏపీ ఎలా ఉండబోతోందనే అంశాన్ని ఆవిష్కరించిన చంద్రబాబు

**అమరావతి, సెప్టెంబర్ 12 :** రాబోయే దశాబ్ద కాలంలో ఆంధ్రప్రదేశ్‌ను దేశంలోనే అగ్రగామి రాష్ట్రంగా నిలబెట్టడమే లక్ష్యమని, ఇందుకోసం ఒక స్పష్టమైన, బృహత్తరమైన ప్రణాళికతో ముందుకు సాగుతున్నామని ముఖ్యమంత్రి చంద్రబాబు ఉద్ఘాటించారు. 2034 నాటికి రాష్ట్ర స్థూల ఉత్పత్తి (జీఎస్‌డీపీ)ని రూ. 57 లక్షల కోట్లకు, ప్రతి వ్యక్తి తలసరి ఆదాయాన్ని రూ. 10.55 లక్షలకు చేర్చడమే ధ్యేయంగా ఎన్డీఏ ప్రభుత్వం పనిచేస్తుందని ఆయన స్పష్టం చేశారు. 'వే2న్యూస్ సంస్థ నిర్వహించిన కాంక్లేవ్‌లో పాల్గొన్న ఆయన, 'స్వర్ణాంధ్ర 2047' విజన్‌ను ఆవిష్కరించి, భవిష్యత్ కార్యాచరణను వివరించారు. ఈ సందర్భంగా చంద్రబాబు మాట్లాడుతూ, "కేవలం విజన్ రూపొందించడంతోనే సరిపెట్టకుండా, దాన్ని ఆచరణలో సాధ్యం చేసే దిశగా పనిచేయాలి. జాతీయ స్థాయిలో 'వికసిత్ భారత్ 2047'కు అనుగుణంగా రాష్ట్రంలో 'స్వర్ణాంధ్ర 2047' విజన్‌ను సిద్ధం చేశాం. ఈ లక్ష్యాలను సాధించడం అసాధ్యమేమీ కాదు. కచ్చితమైన ఆలోచన, బలమైన సంకల్పం ఉంటే ఏదైనా సాధ్యమే" అని అన్నారు. రాష్ట్రంలోని భాగస్వాములందరినీ కలుపుకొని ఇలాంటి కార్యక్రమం నిర్వహించడం అభినందనీయమని ఆయన తెలిపారు. రాష్ట్ర ఆర్థిక ప్రగతికి సంబంధించిన నిర్దిష్ట లక్ష్యాలను ఆయన ప్రజల ముందుంచారు. "ఈ ఏడాది, గత ఏడాది రెండంకెల వృద్ధి సాధించగలిగాం. ఇదే స్ఫూర్తితో 202829 నాటికి రాష్ట్ర జీఎస్‌డీపీని రూ. 29.29 లక్షల కోట్లకు, తలసరి ఆదాయాన్ని రూ. 5.42 లక్షలకు చేరుస్తాం. ఆ తర్వాత, 2034 నాటికి జీఎస్‌డీపీని రూ. 57.21 లక్షల కోట్లకు, తలసరి ఆదాయాన్ని రూ. 10.55 లక్షలకు పెంచేలా ప్రణాళికలు రూపొందించాం. ఈ మెగా డ్రీమ్‌ను నిజం చేసే బాధ్యతను ఎన్డీఏ కూటమి తీసుకుంటుంది" అని చంద్రబాబు భరోసా ఇచ్చారు. గత అనుభవాలను గుర్తుచేసుకుంటూ, "ఒకప్పుడు భారతీయులకు ప్రపంచంలో సరైన గుర్తింపు లేని సమయంలో, తెలుగు బిడ్డ పీవీ నరసింహారావు ప్రధానిగా చేపట్టిన సంస్కరణలతో దేశ ప్రగతి పరుగులు పెట్టింది. 2038 నాటికి భారత్ ప్రపంచంలోనే నంబర్ 1 స్థానానికి చేరుకుంటుంది. ఇందులో తెలుగువారి పాత్ర కీలకంగా ఉండాలి" అని ఆకాంక్షించారు. తాను గతంలో అమలు చేసిన విజన్ 2020 సాకారమైన తర్వాత కూడా ఇంకా కొందరు అనుమానాలు వ్యక్తం చేయడం సరికాదన్నారు. సంక్షేమం, అభివృద్ధిని సమన్వయం చేసుకుంటూ ముందుకు వెళతామని చంద్రబాబు స్పష్టం చేశారు. "భారత్ లాంటి దేశంలో సంక్షేమం, అభివృద్ధి రెండూ సమాంతరంగా సాగాలి. సూపర్ సిక్స్ పథకాల ద్వారా సంక్షేమానికి పెద్దపీట వేస్తూనే, సంపద సృష్టి ద్వారా అభివృద్ధికి సమానంగా నిధులు కేటాయిస్తాం. నేను కేవలం రాజకీయాల గురించే ఆలోచించి ఉంటే హైదరాబాద్ అభివృద్ధి చెందేది కాదు, విద్యుత్ సంస్కరణలు వచ్చేవి కావు. ఇప్పుడు పూర్తి బ్యాలెన్స్ చేస్తున్నాం. సంపద సృష్టించి, దాన్ని పేదలకు పంచుతున్నాం" అని వివరించారు. కేంద్రంలో నరేంద్ర మోదీ నాలుగోసారి ప్రధాని అవుతారని, రాష్ట్రంలో ఎన్డీఏ ప్రభుత్వం కొనసాగుతుందని, ఈ విషయంలో ఎవరికీ ఎలాంటి అనుమానాలు అవసరం లేదని ఆయన ధీమా వ్యక్తం చేశారు.

# మెడికల్ కాలేజీలు ప్రైవేటీకరిస్తున్నారంటూ వైసీపీ ఆరోపణ..

(మొదటిపేజీ తరువాయి)

పూర్తి చేశామని జగన్ అబద్ధపు ప్రచారం చేస్తున్నారని విమర్శించారు. అమరావతిలో జరిగిన ఓ కార్యక్రమంలో పాల్గొన్న చంద్రబాబు, ప్రభుత్వ విధానాలపై స్పష్టత ఇచ్చారు. ప్రస్తుత ప్రభుత్వం అభివృద్ధి మార్గంలో పయనిస్తోందని, ప్రైవేటు భాగస్వామ్యంతో ప్రజలకు మెరుగైన సేవలు అందించడమే తమ లక్ష్యమని చంద్రబాబు పేర్కొన్నారు. గత ప్రభుత్వ పాలనను విమర్శిస్తూనే, తమ హయాంలో జరిగిన అభివృద్ధిని చంద్రబాబు గుర్తుచేశారు. "ఒకప్పుడు రాయలసీమలో పదేళ్లలో ఎనిమిదేళ్లు కరవు ఉండేది. దేశంలోనే అత్యల్ప వర్షపాతం నమోదయ్యే అనంతపురం జిల్లాను మేం అభివృద్ధి చేసి చూపించాం. నీటిపారుదల సౌకర్యాలు మెరుగుపరచడం, హార్టికల్చర్‌ను ప్రోత్సహించడం వల్లే ఇవాళ ఆ జిల్లా జీఎస్‌డీపీలో గోదావరి జిల్లాలను మించిపోయింది" అని వివరించారు. కేవలం వృథాగా పోయే నీటిని మాత్రమే బనకచర్ల కాలువలకు వినియోగిస్తామని కూడా ఆయన స్పష్టం చేశారు.

## ఉపరాష్ట్రపతిగా
# సీపీ రాధాకృష్ణన్ ప్రమాణ స్వీకారం

న్యూఢిల్లీ, సెప్టెంబర్ 12 : భారతదేశ 15వ ఉపరాష్ట్రపతిగా సీపీ రాధాకృష్ణన్ ఈ రోజు బాధ్యతలు చేపట్టారు. ఢిల్లీలోని రాష్ట్రపతి భవన్‌లో అత్యంత వైభవంగా జరిగిన కార్యక్రమంలో రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము ఆయన చేత పదవీ ప్రమాణం చేయించారు. ఈ కార్యక్రమానికి ప్రధాని నరేంద్ర మోదీ, లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లా, కేంద్ర మంత్రులు అమిత్ షా, రాజ్‌నాథ్ సింగ్, జేపీ నడ్డా సహా పలువురు మంత్రులు, ఎన్డీయే భాగస్వామ్య పక్షాల నేతలు హాజరయ్యారు. మాజీ రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్, మాజీ ఉపరాష్ట్రపతులు జగదీప్ ధన్‌ఖడ్, వెంకయ్యనాయుడు కూడా ఈ వేడుకలో పాల్గొన్నారు. అలాగే ఏపీ సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ పాల్గొన్నారు. రాజీనామా చేసిన తర్వాత ధన్‌ఖడ్ బహిరంగంగా కనపడడం ఇదే తొలిసారి. ఇటీవల జరిగిన ఉపరాష్ట్రపతి ఎన్నికల్లో ఎన్డీయే అభ్యర్థిగా బరిలోకి దిగిన రాధాకృష్ణన్, విపక్షాల ఉమ్మడి అభ్యర్థి జస్టిస్ బి. సుదర్శన్ రెడ్డిపై 152 ఓట్ల తేడాతో విజయం సాధించిన విషయం తెలిసిందే. ఈ ఎన్నికల్లో రాధాకృష్ణన్‌కు 452 ఓట్లు రాగా, సుదర్శన్ రెడ్డికి 300 ఓట్లు పోలయ్యాయి. ఈ నేపథ్యంలోనే ఆయన గురువారం మహారాష్ట్ర గవర్నర్ పదవికి రాజీనామా



చేశారు. ప్రస్తుతం ఆ రాష్ట్ర గవర్నర్‌గా గుజరాత్ గవర్నర్ ఆచార్య దేవవ్రత్‌కు అదనపు బాధ్యతలు అప్పగించారు. చిన్న వయసులోనే ఆర్ఎస్ఎస్ భావజాలానికి ఆకర్షితులైన రాధాకృష్ణన్, తన 16వ ఏటనే రాజకీయాల్లోకి ప్రవేశించారు. తమిళనాడు బీజేపీలో కార్యదర్శిగా, అధ్యక్షుడిగా కీలక బాధ్యతలు నిర్వర్తించారు. 1998, 1999 లోక్‌సభ ఎన్నికల్లో కోయంబత్తూర్ నుంచి రెండుసార్లు ఎంపీగా గెలుపొందారు. తన అనుచరులు ఆయన్ను 'తమిళనాడు మోదీ' అని పిలుచుకుంటారు. మహారాష్ట్ర గవర్నర్‌గా బాధ్యతలు చేపట్టడానికి ముందు ఆయన జార్ఖండ్ గవర్నర్‌గా, తెలంగాణ ఇన్‌చార్జి గవర్నర్‌గా, పుదుచ్చేరి లెఫ్టినెంట్ గవర్నర్‌గానూ సేవలు అందించారు.

# గోదావరి పుష్కరాలు 2027
## ఇప్పటినుంచే తెలంగాణ ప్రభుత్వం ఫోకస్

2027లో జరగనున్న గోదావరి పుష్కరాలను అత్యంత వైభవంగా, పకడ్బందీగా నిర్వహించేందుకు తెలంగాణ ప్రభుత్వం ఇప్పటినుంచే కార్యాచరణను ప్రారంభించింది. ఈ పుష్కరాలను 'దక్షిణ కుంభమేళా'గా పరిగణించి, భారీ ఏర్పాట్ల కోసం కేంద్ర ప్రభుత్వం నుంచి ప్రత్యేక ఆర్థిక ప్యాకేజీని కోరాలని నిర్ణయించింది. శుక్రవారం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అధ్యక్షతన జరిగిన ఉన్నతస్థాయి సమావేశంలో ఈ కీలక నిర్ణయం తీసుకున్నారు. పుష్కరాలు ప్రారంభం కావడానికి ఇంకా 22 నెలల సమయం ఉన్నప్పటికీ, భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా దీర్ఘకాలిక ప్రణాళికతో శాశ్వత ప్రాతిపదికన అభివృద్ధి పనులు చేపట్టాలని ముఖ్యమంత్రి అధికారులను ఆదేశించారు. కేవలం తాత్కాలిక ఏర్పాట్లతో సరిపెట్టకుండా, భవిష్యత్తు అవసరాలను కూడా దృష్టిలో ఉంచుకుని శాశ్వత మౌలిక సదుపాయాలు కల్పించాలని ఆయన స్పష్టం చేశారు. తెలంగాణలో గోదావరి నది ప్రవహించే బాసర, కాళేశ్వరం, ధర్మపురి, భద్రాచలం వంటి ప్రధాన పుణ్యక్షేత్రాలకు అధిక సంఖ్యలో భక్తులు వస్తారని, అందువల్ల ఈ ప్రాంతాల్లో అభివృద్ధి పనులకు తొలి ప్రాధాన్యం ఇవ్వాలని ముఖ్యమంత్రి సూచించారు. రోజుకు రెండు లక్షలకు పైగా భక్తులు వచ్చినా తట్టుకునేలా రోడ్లు, పార్కింగ్, తాగునీరు, స్నానఘట్టాలు, వసతి వంటి సౌకర్యాలు కల్పించాలని అన్నారు. రాష్ట్రంలో గోదావరి నది సుమారు 560 కిలోమీటర్ల మేర ప్రవహిస్తుండగా, 74 ఘాట్లను పుష్కరాల కోసం సిద్ధం చేయాలని ప్రతిపాదించారు. ప్రతి ప్రధాన ఆలయం, ఘాట్ వద్ద క్షేత్రస్థాయిలో పర్యటించి, స్థానిక అధికారులు, ఆలయ కమిటీలతో చర్చించి సమగ్ర ప్రాజెక్టు నివేదికలు తయారు చేయాలని అధికారులకు సూచించారు. ఇతర రాష్ట్రాల్లో కుంభమేళా, పుష్కరాల నిర్వహణలో అనుభవం ఉన్న కన్సల్టెంట్ల సేవలను వినియోగించుకోవాలని ముఖ్యమంత్రి సలహా ఇచ్చారు. ఈ భారీ ఏర్పాట్ల కోసం స్వచ్ఛ భారత్, జల్ జీవన్ మిషన్ వంటి కేంద్ర ప్రభుత్వ పథకాల నుంచి కూడా నిధులు సమీకరించాలని ఆయన దిశానిర్దేశం చేశారు. పర్యాటక, నీటిపారుదల, దేవాదాయ శాఖలు సమన్వయంతో పనిచేసి పుష్కరాల నాటికి అన్ని పనులు పూర్తి చేయాలని ఆదేశించారు. ఈ సమావేశంలో దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ, ప్రభుత్వ ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

# సమాజంలో గురువు స్థానం గొప్పది..




- మంచి విద్యనిస్తే పిల్లల గుండెల్లో నిలిచిపోతారు..
- రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి సీ.దామోదర రాజనర్సింహా
- 126 మంది ఉత్తమ ఉపాధ్యాయులకు పురస్కారాలు

అందోల్, ప్రజాస్ఫూర్తి :సమాజ నిర్మాణంలో గురువు భాద్యత చాలా గొప్పదని, తల్లిదండ్రుల ఇద్దరి గుణములను కలిగిన వ్యక్తియే గురువు అన్న విషయం ప్రతి ఒక్కరు తెలుసుకోవాలని రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖా మంత్రి సి.దామోదర్ రాజనర్సింహ అన్నారు. శుక్రవారం అందోలు మండలం అల్మాయిపేట లక్ష్మిదేవి గార్డెన్‌లో జరిగిన నియోజకవర్గ స్థాయిలో ఉత్తమ ఉపాధ్యాయుల పురస్కార కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హజరై ప్రసంగించారు. ఈ కార్యక్రమానికి జిల్లా పీఆర్‌టీయు అధ్యక్షుడు ఎ. మాణయ్య అధ్యక్షత వహించారు. మంచి చెడులను నేర్పుతూ సమాజ నిర్మాతలను తయారు చేయడంలో ఉపాధ్యాయుల పాత్ర గొప్పదని అన్నారు. ఏదైన వృత్తిలో ఫ్యాషన్ ఉండాలని ఫ్యాషన్ ఉంటేనే కమిట్‌మెంట్ వస్తుందన్నారు. గురువు ఉన్న ప్రదేశంలో అక్కడి సమాజ ప్రవర్తన తెలుస్తుందన్నారు. ఆసుపత్రికి వెళితే ప్రజలకు ఆర్థిక భారం కలగకూడదన్నదే ప్రభుత్వ ఉద్దేశమన్నారు.విద్య, వైద్యం, నైపుణ్యం వంటివి అందించడం ద్వారా ఈ పోటి ప్రపంచంలో బ్రతుకగలుగుతారనే నమ్మకం కలిగించాలన్నారు.

**ప్రభుత్వ ఉద్యోగులకు హెల్త్ కార్డులు...**

ఈ సమావేశంలో పలువురు ఉపాధ్యాయులు హెల్ కార్డు ప్రస్తావన తీసుకురాగా మంత్రి స్పందించారు. ప్రతి ఒక్క ప్రభుత్వ ఉద్యోగికి హెల్త్ కార్డు ఇవ్వాలన్నదే ప్రభుత్వ ఉద్దేశమన్నారు. అందోలు నియోజకవర్గంలో ఫార్మసీ కళాశాల ఏర్పాటుకు కృషి చేస్తున్నట్లు తెలిపారు. రాష్ట్రంలో తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత అద్భుతాలు జరుగుతాయని భావించాం కానీ జరగలేదని, తాను ఈ మాట రాజకీయంగా మాట్లాడడంలేదని, తెలంగాణ రాష్ట్రం అన్ని విధాలుగా అభివృద్ధి చెందాల్సిన అవసరం ఉందన్నారు. అందుకు అవసరమైన ప్రణాళికను ప్రజాప్రభుత్వం సిద్ధం చేస్తుందన్నారు.

**విద్యశాఖ అంటే ఇష్టం...**

విద్య, వైద్యం రెండు శాఖలు ముఖ్యమైనవన్నారు. గతంలో 8 సంవత్సరాలు విద్యాశాఖ మంత్రిగా పనిచేయడం నా అదృష్టంగా బావిస్తున్నానన్నారు. నాకు ఇష్టమైన శాఖ విద్యాశాఖయన్నారు. రూ.450 కోట్లతో 165 ఎకరాల విస్తీర్ణంలో జెన్‌టీయూ నిర్మాణం చేపట్టడం జరిగిందన్నారు. నాకు నష్టం జరిగినా విద్యా సంస్థల ఏర్పాటుకు కృషి చేశానన్నారు. 10 ఏళ్ల తర్వాత తాను నెలకొల్పిన విద్య సంస్థల విలువలు బయటకు వస్తాయన్నారు. అగ్రికల్చర్ పాలిటెక్నిక్ కళాశాలు, మండలానికొక మోడల్ పాఠశాలలు, కస్తూర్భా గాంధీ విద్యాలయాలు ఏర్పాటు చేశామన్నారు. సమాజానికి బాలికల చదువు చాలా ముఖ్యమని, అమ్మాయిలు చదివితేనే ఓ చెల్లిగా, భార్యగా , తల్లిగా కుటుంబానికి సంపూర్ణ భరోసా ఉంటుందన్నారు. నియోజకవర్గంలో రూ.15 కోట్లతో బాలికల విద్యా సంస్థల్లో మౌళిక వసతులు కల్పించామన్నారు. 3,4 నెలల్లో విద్యా సంస్థల రూపు రేఖలు మారిపోతాయన్నారు.



ఉమ్మడి రాష్ట్రంలో రాజనర్సింహా అంటే అందోల్ నుండి గుర్తింపు వచ్చిందని, అందుకే ఈ ప్రాంతానికి రుణపడి ఉంటానని అన్నారు. ఏ నాయకుడికైనా ఓటేస్తే రాబోయే 5ఏళ్లలో నాకుటుంబానికి , గ్రామానికి, సమాజానికి ప్రాంతానికి అభివృద్ధి ముడిపడి ఉందని గ్రహించి ఓటెయ్యాలన్నారు. ఓటు విలువ తెలిసిననాడే ప్రజా స్వామ్యం పటిష్టంగా ఉంటుందన్నారు.దారి చూపెట్టడం కాదు..దారి నిర్మంచేవాడే నాయకుడు మనిషి సంఘజీవి అని అరిస్టాటిల్ చెప్పిన విషయాన్ని గుర్తు చేసారు. తెలంగాణ వచ్చిన తర్వాత అద్భుతాలు జరుగుతాయనుకున్నాంమని జరుగలేదన్నారు. అంగన్‌వాడీ విద్య తర్వాత విద్యార్థులు డ్రాపౌట్స్ అవుతున్నారన్నారు. ప్రభుత్వ పాఠశాలలో నిష్ణాతులైన ఉపాద్యాయులుగా నాణ్యమైన విద్యను అందించి డ్రాపౌట్స్ తగ్గించాలన్నారు. అందుకు ప్రభుత్వం కృషి ఉంటుందన్నారు. కాంగ్రేస్ ప్రభుత్వం అధికారంలోకి రాగానే డీఎస్సీ నిర్వహించామని, కోర్టు ద్వారా ఉత్తర్వులు పొందిన వారికి ఉద్యోగ అవకాశాలు కల్పించామన్నారు.ఈ కార్యక్రమంలో ఆర్డిఓ పాండు, పిఆర్టియు అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు ఆకుల మానయ్య, ప్రభు, టీఎస్ యుటిఎఫ్ జిల్లా కార్యదర్శి బి. సాయిలు, ఎస్టియు జిల్లా అధ్యక్షులు సాబీర్ అలీ, టి పి టి ఎఫ్ జిల్లా ఉపాధ్యక్షులు నాసర్ పాటిల్, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ అంజయ్య, రాష్ట్ర మార్క్ఫెడ్ డైరెక్టర్ ఎస్ జగన్ మోహన్ రెడ్డి, జోగిపేట మార్కెట్ కమిటీ చైర్మన్ ఎం. జగన్మోహన్ రెడ్డి, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు శివరాజ్, మాజీ కౌన్సిలర్లు ఆకుల చిట్టిబాబు, కె.నాగరాజు, పిఎసిఎస్ చైర్మన్ నరేందర్ రెడ్డి, ఆయా మండలాల విద్యాధికారులు బండి కృష్ణ (అందోల్), అనురాధ (చోటకూర్), భీమ్ సింగ్ (మునిపల్లి), మానయ్య (రాయపాడు), రంజిత్ కుమార్ (వట్పల్లి), ధనుంజయ (అల్లాదుర్గం), గురునాథ్ (వెరీ గుడ్,), సుజాత (టేక్మల్,) తదితరులు పాల్గొన్నారు.

## చౌటుప్పల్ మార్కెట్ యార్డ్ కమర్షియల్ షాపుల బహిరంగ వేలం



చౌటుప్పల్, ప్రజాస్ఫూర్తి: చౌటుప్పల్ వ్యవసాయ మార్కెట్ యార్డు ముందు భాగంలో ఉన్న కమర్షియల్ షాపులకు బహిరంగ వేలంపాటకు ప్రత్యేక సమావేశాన్ని శుక్రవారం నిర్వహించారు. చౌటుప్పల్ వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ ఉబ్బు వెంకటయ్య అధ్యక్షతన, జిల్లా మార్కెటింగ్ అధికారి ఏ సభిత సమక్షంలో వేలంపాట నిర్వహించారు. ఈ వేలంపాటలో షాప్ నెంబర్ 1, కర్నాటి నరేష్ రూ.12,100లకు వేలంపాటలో దక్కించుకున్నారు. షాప్ నెంబర్ 2, వంగురి పార్వతమ్మ రూ.12,500లకు, షాప్ నెంబర్ 3, దేశట్ల శ్రీనివాస్ రూ.10,100లకు, షాప్ నెంబర్ 4, బానోతు రవి కుమార్ రూ.12,100లకు, షాప్ నెంబర్ 5, కాసోజు శ్రీకాంత్ రూ.12,150లకు, షాప్ నెంబర్ 6, కాసోజు గోవర్ధన్ రూ.11,000లకు వేలం పాటలో షాప్ లు పొందారు. ఈ కార్యక్రమములో చౌటుప్పల్ వ్యవసాయ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ ఆకుల ఇంద్రసేనారెడ్డి, డైరెక్టర్లు గౌస్ ఖాన్, బోయ వెంకటేష్, మార్కెట్ కమిటీ కార్యదర్శి రవీందర్ రెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

## ధర్మోజిగూడెంలో ఉచిత వైద్య శిబిరం



చౌటుప్పల్, ప్రజాస్ఫూర్తి: చౌటుప్పల్ మండలం ధర్మోజిగూడెం గ్రామపంచాయతీ కార్యాలయ ఆవరణలో కామినేని హాస్పిటల్ ఆధ్వర్యంలో శుక్రవారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా యువజన కాంగ్రెస్ జిల్లా మాజీ ఉపాధ్యక్షుడు జువ్వి నరసింహ హాజరయ్యారు. గ్రామస్తులు ఉచిత వైద్య శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. వైద్య శిబిరంలో భాగంగా బీపీ, షుగర్ లతో పాటు పలురకాల వైద్య పరీక్షలు నిర్వహించారు. అవసరమైన వారికి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. ముఖ్యంగా వృద్ధులు మోకాళ్ళ నొప్పులు, కీళ్ల నొప్పులకు వైద్యం చేయించుకున్నారు. ఉచితంగా మందులు పంపిణీ చేసిన కామినేని వైద్య బృందానికి కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి భాగ్యలక్ష్మి, కామినేని హాస్పిటల్ సూపర్ వైజర్ బాలకృష్ణ, వైద్య బృందం, గ్రామ పంచాయతీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## ప్రజలతో కార్యకర్తలు మమేకం కావాలి ఎంపీ రఘునందన్ రావు

*జిన్నారం సమావేశంలో పాల్గొన్న ఎంపీ
*పలువురు బీజేపీ పార్టీలో చేరిక
*రమేష్ కుటుంబానికి పరామర్శ

జిన్నారం,ప్రజాస్ఫూర్తి 12: భారతీయ జనతా పార్టీ కార్యకర్త ప్రజల్లో మమేకమై పనిచేయాలని మెదక్ ఎంపీ రఘునందన్ రావు అన్నారు. ప్రధాని నరేంద్ర మోడీ జన్మదినాన్ని పురస్కరించుకొని సేవా పక్వాడ్ జిన్నారం మండల భారతీయ జనతా పార్టీ మండల అధ్యక్షులు కొత్త కాపు జగన్ రెడ్డి ఆధ్వర్యంలో మండల కేంద్రంలో సేవా పక్వాడ్ కార్యక్రమంలో పాల్గొన్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ సేవా పక్షంతో పనిచేయాలని ప్రజలకు ఉపయోగపడే పనులు నిరంతరం ప్రజల మధ్య ఉండి ప్రజా సమస్యలు తీర్చాలన్నారు. ప్రధానమంత్రి నరేంద్ర మోడీ సెప్టెంబర్ 17 తేదీన జన్మదిన సందర్భంగా రక్తదాన శిబిరం ఏర్పాటు చేసి ప్రతి ఒక్కరు మంచి సేవ భావంతో రక్తదానం చేయాలని సూచించారు. కార్యక్రమంలో రాష్ట్ర నాయకులు ఎడ్ల రమేష్ సంగారెడ్డి జిల్లా ఉపాధ్యక్షులు వంగేటి ప్రతాపరెడ్డి నాయకులు శంషాబాద్ రాజు వంగేటి రాజిరెడ్డి పూడూరి సుధాకర్ మాణిక్యం రమణ సింగ్ గుమ్మడిదల మండల అధ్యక్షులు ఐలేష్ గోవర్ధన్ రెడ్డి



నాయకులు మద్దూరి రాజు నల్లగండ్ల అశోక్ కుమార్ శక్తి కేంద్ర ఇన్చార్జిలు బూత్ అధ్యక్షులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

*** దోమడుగు రమేష్ కుటుంబానికి పరామర్శ**

ఇటీవల గుండెపోటుతో మృతి చెందిన బీజేపీ నాయకుడు దోమడుకు రమేష్ కుటుంబాన్ని ఎంపీ రఘునందన్ రావు పరామర్శించారు. ఆయన కుటుంబాన్ని పరామర్శించారు. కుటుంబానికి భారతీయ జనతా పార్టీ పూర్తి అండగా ఉంటుందని ఆయన హామీ నిచ్చారు. కార్యక్రమంలో పలువురు బిజెపి నాయకులు పాల్గొన్నారు.

## ఓటు చోరీ.. ప్రజాస్వామ్య దోపిడీ

- పంతంగిలో ప్రజలకు అవగాహన
- మేకల ప్రమోద్ రెడ్డి

చౌటుప్పల్, ప్రజాస్ఫూర్తి: ప్రజాస్వామ్య పరిరక్షణకు ప్రధాన ఆయుధం ఓటు.. అలాంటి ఓటును చోరీ చేయడం ప్రజాస్వామ్య దోపిడీ అని నల్లగొండ జిల్లా యువజన కాంగ్రెస్ అధ్యక్షులు మేకల ప్రమోద్ రెడ్డి అన్నారు. నల్లగొండ జిల్లా యువజన కాంగ్రెస్ ఆధ్వర్యంలో మునుగోడు నియోజకవర్గం పంతంగి గ్రామం (బూత్ నం.18, 19, 20, 21)లో డోర్ టు డోర్ ఓటర్ గుర్తింపు కార్యక్రమం శుక్రవారం నిర్వహించారు. చౌటుప్పల్ మండల యువజన కాంగ్రెస్ అధ్యక్షుడు రాచకొండ భార్గవ్ ఆధ్వర్యంలో నల్లగొండ జిల్లా యువజన కాంగ్రెస్ అధ్యక్షుడు మేకల ప్రమోద్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. గ్రామంలోని ప్రతి ఇంటిని సందర్శిస్తూ ఓటర్ల జాబితా పరిశీలన చేశారు. లోపాల గుర్తింపు, ప్రజల్లో అవగాహన కల్పించడమే ప్రధాన లక్ష్యంగా ముందుకు సాగారు. ఈ సందర్భంగా నల్లగొండ జిల్లా యువజన కాంగ్రెస్ అధ్యక్షులు మేకల ప్రమోద్ రెడ్డి గారు మాట్లాడుతూ ఓటర్ లిస్టుల్లో డుప్లికేట్ పేర్లు చేర్చడం, నిజమైన ఓటర్ల పేర్లు తొలగించడం, బోగస్ ఓటర్లను నమోదు చేయడం వంటి అక్రమాలు ప్రజాస్వామ్యాన్ని దెబ్బతీస్తున్నాయన్నారు. ప్రజాస్వామ్యాన్ని బలహీనపరుస్తూ, ఓటు చోరీకి పాల్పడుతున్న ప్రధాన రాజకీయ శక్తి కేంద్రంలో అధికారం లో ఉన్న బీజేపీ పార్టీ అని ఆరోపించారు. అధికారంలోకి రావడమే లక్ష్యంగా పెట్టుకున్న బీజేపీ, ఎన్నికల వ్యవస్థను మలినం చేస్తోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఓటు హక్కు అంటే కేవలం ఓటు వేసే హక్కు మాత్రమే కాదని, ప్రజాస్వామ్య పరిరక్షణకు ప్రధాన



ఆయుధమన్నారు. ప్రజలు నిర్లక్ష్యం చేస్తే అవినీతి శక్తులు ప్రజాస్వామ్యాన్ని కబళిస్తాయని హెచ్చరించారు. గ్రామ ప్రజలు కూడా కార్యక్రమంలో చురుకుగా పాల్గొని తమ సమస్యలను నాయకులకు వివరించారు. స్థానికులు ఓటు జాబితాల్లో కనబడిన లోపాలపై ఉదాహరణలు చూపించి, వాటిని సరిచేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో మునుగోడు నియోజకవర్గ యువజన కాంగ్రెస్ అధ్యక్షుడు అబ్బనబోయిన రామకృష్ణ యాదవ్, నల్లగొండ జిల్లా యువజన కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి జాల మణికంఠ, పంతంగి యువజన కాంగ్రెస్ గ్రామ అధ్యక్షుడు బోయ సంపత్, పలువురు యువజన కాంగ్రెస్ కార్యకర్తలు పాల్గొన్నారు.

## భగత్ సింగ్ నగర్ వైకుంఠధామాన్ని మోడల్ గ్రేవ్ యార్డ్ గా తీర్చిదిద్దుతా



బిఆర్ఎస్ ఎల్పీ విప్, కుత్బుల్లాపూర్ ఎమ్మెల్యే కెపి.వివేకానంద్

జీడిమెట్ల, (ప్రజాస్ఫూర్తి ) : భగత్ సింగ్ నగర్ వైకుంఠధామాన్ని మోడల్ గ్రేవ్ యార్డ్ గా తీర్చిదిద్దుతామని బిఆర్ఎస్ ఎల్పీ విప్, కుత్బుల్లాపూర్ ఎమ్మెల్యే కెపి.వివేకానంద్ అన్నారు. శుక్రవారం చింతల్ డివిజన్ కి చెందిన సంక్షేమ సంఘాల నాయకులు పేట్ బషీరాబాద్ లోని ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో బిఆర్ఎస్ ఎల్పీ విప్, ఎమ్మెల్యే కెపి.వివేకానంద్ని మర్యాదపూర్వకంగా కలిసి భగత్ సింగ్ నగర్ స్మశాన వాటిక ను అభివృద్ధి పరచాలని, అభివృద్ధిలో భాగంగా చెట్ల పొదల తొలగింపు, నీటి సౌకర్యం, స్మశాన వాటిక లోని మౌలిక వసతులు, స్నానాల గదుల నిర్మాణం, కాపాలాదారుడి ఏర్పాటు, దహన వాటిక, స్టార్ రూమ్, వాచ్ మెన్ రూమ్, వాహనాల పార్కింగ్, గ్యాలరీ వంటి ఇబ్బందులను విన్నవించారు.ఈ సందర్భంగా బిఆర్ఎస్ ఎల్పీ విప్, ఎమ్మెల్యే కెపి.వివేకానంద్ మాట్లాడుతూ బిఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో కుత్బుల్లాపూర్ నియోజకవర్గంలోని పలు వైకుంఠధామాలకు కోట్లాది రూపాయల నిధులతో అన్ని విధాలుగా అభివృద్ధి పరిచామన్నారు. రానున్న రోజుల్లో కూడా భగత్ సింగ్ స్మశాన వాటికను అభివృద్ధి పరిచి సమీప కాలనీ వాసులకు అందుబాటులోకి తెస్తామన్నారు.ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకులు దేగ కృష్ణమూర్తి, చింతల్, చంద్రా నగర్, భగత్ సింగ్ నగర్, దుర్గయ్య నగర్, రంగా నగర్, స్టార్ లైట్ అపార్ట్మెంట్, స్ఫూర్తి నగర్, ఆదర్శ నగర్, వైఎంఎస్ కాలనీ, సాయి కాలనీ, శివా నగర్ కాలనీల సంక్షేమ సంఘాల సభ్యులు, కాలనీ వాసులు తదితరులు పాల్గొన్నారు

## బిజెపి నూతన రాష్ట్ర ఉపాధ్యక్షులకు సన్మానం



చౌటుప్పల్, ప్రజాస్ఫూర్తి: బిజెపి రాష్ట్ర ఉపాధ్యక్షులుగా ఎన్నికైన మాజీ ఎంపీ డాక్టర్ బూర నర్సయ్య గౌడ్, డాక్టర్ కాసు వెంకటేశంలను చౌటుప్పల మండల అధ్యక్షుడు కైరంకొండ అశోక్ ఆధ్వర్యంలో బిజెపి నాయకులు శుక్రవారం మర్యాదపూర్వకంగా కలిశారు. నూతనంగా రాష్ట్ర ఉపాధ్యక్షులు పదవులు చేపట్టడం పట్ల శాలువాతో ఘనంగా సన్మానించారు. ప్రత్యేకంగా శుభాకాంక్షలు తెలిపారు. భవిష్యత్తులో మరిన్ని ఉన్నత పదవులు చేపట్టాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో బిజెపి జిల్లా ఉపాధ్యక్షుడు శాగ చంద్రశేఖర్ రెడ్డి, మాజీ సర్పంచ్ లు కాయితి రమేష్ గౌడ్, గడ్డం నరసింహ, మునగాల తిరుపతిరెడ్డి, పాలకూర్ల జంగయ్య గౌడ్, ఊడుగు యాదయ్య గౌడ్, కంచర్ల గోవర్ధన్ రెడ్డి, చినుకని మల్లేష్ యాదవ్, దుర్గ కృష్ణ, కట్ట కృష్ణ పోట్టబతిని బాలరత్నం, నూనె సహదేవ్, పబ్బతి శేఖర్ గౌడ్, ఎన్నంపల్లి శ్రీకాంత్ రెడ్డి, బత్తుల కృష్ణ, మునుకుంట్ల వెంకటేశం గౌడ్, కొయ్యడ స్వామి గౌడ్, ఊర సృజన్, అల్మాస్ పేట గౌతమ్, బొంగు వెంకటేశం గౌడ్, వెంకటరమణ గౌడ్, చౌట రవీందర్ గౌడ్, బాతరాజు సాయి తదితరులు పాల్గొన్నారు.

## రాబోయే రోజుల్లో పెండింగ్ లో ఉన్న పనులను పూర్తి చేస్తాం

*** కూకట్ పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు**

కూకట్ పల్లి, (ప్రజాస్ఫూర్తి) : రాబోయే రోజుల్లో పెండింగ్ లో ఉన్న పనులను పూర్తి చేస్తామని కూకట్ పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు అన్నారు. శుక్రవారం కూకట్ పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు , బోయిన్ పల్లి కార్పొరేటర్ ముద్దం నరసింహ యాదవ్ తో కలిసి బోయిన్ పల్లి లోని షేర్ గల్లి నేమ్ బోర్డ్ , నూతన మదరసాను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బోయిన్ పల్లి డివిజన్లోని గత మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ నాయకత్వంలో ఎన్నో అభివృద్ధి కార్యక్రమాలు చేశామన్నారు. హస్మత్ పేట చెరువు అభివృద్ధి, ఈ ప్రాంతం వర్షాలు వచ్చినప్పుడు మునగకుండా కల్వర్టు నిర్మాణం ..రోడ్లు, డ్రైనేజ్ వ్యవస్థ దాదాపు 90 శాతం పనులు పూర్తి చేసుకున్నామని గుర్తు చేశారు. రాబోయే రోజుల్లో పెండింగ్ పనులు కూడా పూర్తి చేస్తామని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో డివిజన్ అధ్యక్షులు ఇర్ఫాన్, మేడ్చల్ జిల్లా మైనార్టీ అధ్యక్షులు మహమ్మద్ గౌసిద్దీన్, సీనియర్ నాయకులు మక్కాల నర్సింగరావు, ఇజాజ్, జంగయ్య, హరినాథ్, పోచయ్య, బలవంత్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



# పేద విద్యార్థుల చదువుకు ఆటంకం ఏర్పడ వద్దనే సైకిళ్లు అందిస్తున్న కేంద్ర మంత్రి బండి

- బిజెపి జిల్లా అధ్యక్షుడు రెడ్డబోయిన గోపి
- 85 మంది విద్యార్థులకు సైకిళ్ల పంపిణీ



ప్రజాస్ఫూర్తి, ముస్తాబాద్: చదువుకు ఆటంకం ఏర్పడ వద్దనే సిఎస్ఆర్ నిధులతో మోడీ గిఫ్ట్‌గా కరీంనగర్ పార్లమెంట్ పరిధిలో కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ తన జన్మదినం సందర్భంగా ప్రభుత్వ బడిలో పదో తరగతి చదువుతున్న పేద విద్యార్థిని, విద్యార్థులకు ఉచితంగా సైకిళ్లను అందిస్తున్నారని బిజెపి జిల్లా అధ్యక్షుడు రెడ్డబోయిన గోపి అన్నారు. ముస్తాబాద్ మండల కేంద్రంలోని ప్రభుత్వ పాఠశాలలో చదువుతున్న 10వ తరగతి విద్యార్థినీ, విద్యార్థులకు 85 మందికి సైకిళ్ల పంపిణీ కార్యక్రమాన్ని బిజెపి మండల అధ్యక్షుడు సౌల్ల క్రాంతి కుమార్ ఆధ్వర్యంలో శుక్రవారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా బిజెపి జిల్లా అధ్యక్షుడు రెడ్డబోయిన గోపి హాజరై సైకిళ్లను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ స్కూళ్లలో చదువుకునే పిల్లలు పేద కుటుంబం నుండి వచ్చిన వాళ్లే ఉంటారనే విషయం తెలిసిందేనని, తమ ఇంటి నుండి స్కూల్ దాకా వెళ్లడానికి తగిన రవాణా సౌకర్యాల్లేక, ఆటోలు, బస్సులు వెళ్లే స్థోమత లేక ఇబ్బందులు పడుతుంటారని, ముఖ్యంగా టెన్త్ క్లాస్ విషయానికొచ్చే సరికి స్కూల్ వేళలు ముగిసిన తరువాత స్పెషల్ క్లాస్‌లకు హాజరు కావాల్సి ఉంటుందని, దీని వల్ల పొద్దుపోయేదాకా స్కూళ్లోనే ఉండాల్సి వస్తుందని, దీనిని దృష్టిలో ఉంచుకుని టెన్త్ బాల బాలికలకు రవాణా ఇబ్బంది ఉండకూడదనే సదుద్దేశంతో కేంద్ర మంత్రి బండి సంజయ్ కుమార్ ప్రధాని మోదీ కానుకగా సైకిళ్లను పంపిణీ చేస్తున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంఇఓ రాజిరెడ్డి, ఎస్ఐ గణేష్, జిల్లా ఉపాధ్యక్షుడు మల్లారపు సంతోష్ రెడ్డి, జిల్లా కార్యదర్శి మీస సంజీవ్, మాజీ మండల అధ్యక్షులు కస్తూరి కార్తీక్ రెడ్డి, మండల ప్రధాన కార్యదర్శిలు గోపి, మహేశ్వరీ, బిజెపి సీనియర్ నాయకులు మీసా శంకర్, వంతడుపుల సుధాకర్, సందేవేని రాజు, పప్పుల శ్రీకాంత్, కోల కృష్ణ, చిగురు వెంకన్న, రమేష్, మహేందర్, మండల కార్యవర్గ సభ్యులు గుండవేణి తిరుపతి, బెదుర ప్రశాంత్, నిమ్మల కనకయ్య, జిల్లెళ్ళ మల్లేష్, నర్ర ప్రశాంత్ రెడ్డి, మహిళా నాయకురాలు పద్మ తదితరులున్నారు.

## గుట్టల అక్రమ తవ్వకాలను తక్షణమే నిలిపివేయాలి

* సిపిఐ ఎంఎల్ న్యూడెమోక్రసీ



ప్రజా స్ఫూర్తి, భద్రాద్రి కొత్తగూడెం: కొత్తగూడెంలోని పోస్ట్ ఆఫీస్ బైపాస్, శేషగిరి నగర్-హేమచంద్రపురం బైపాస్ రోడ్డులో సుమారు 500 ఎకరాల గుట్ట అక్రమ తవ్వకాలకు గురవుతున్నది. రాత్రికి రాత్రే జేసిబీలు, ట్రాక్టర్లతో తవ్వకాలు జరుపుతూ మట్టిని, రాళ్లను తరలిస్తున్నారని సిపిఐ ఎంఎల్ న్యూడెమోక్రసీ జిల్లా సహాయ కార్యదర్శి గౌని నాగేశ్వరరావు ఆరోపించారు.ఈ గుట్టలో పచ్చని వేప చెట్లు, పెద్ద పెద్ద రాళ్లు, సహజసిద్ధమైన వనరులు ఉండి ప్రకృతికి, పర్యావరణానికి ఊపిరిగా ఉన్నాయని ఆయన తెలిపారు. అయితే కొంతమంది స్వార్థపరులు అధికారుల అండదండలతో అనుమతులు లేకుండానే రాత్రివేళ అక్రమంగా తవ్వకాలు చేపట్టి లక్షల రూపాయల సంపదను దోచుకుంటున్నారని విమర్శించారు. "ఆదివాసీలు వంట కోసం కట్టెలు తెచ్చుకున్నా కేసులు పెట్టే ఈ పాలకులు, అధికారులు... గుట్టలు నేలమట్టం అవుతున్నా నోరు మెదపడం లేదేంటి?" అని ఆయన ప్రశ్నించారు. గత పదిరోజులుగా అర్ధరాత్రి పూట జేసిబీలు, ట్రాక్టర్లతో చెట్లను నరికి, రాళ్లను, మట్టిని తరలిస్తున్నారని, అధికారులు కళ్ళు మూసుకుని చూస్తున్నట్టే వ్యవహరిస్తున్నారని మండిపడ్డారు.ఈ మైనింగ్ కార్యకలాపాలకు ఎలాంటి పర్మిషన్లు గాని, రికార్డులు గాని లేవు కాబట్టి తక్షణమే చర్యలు తీసుకొని అక్రమ తవ్వకాలను నిలిపివేయాలని ఆయన డిమాండ్ చేశారు. లేకపోతే తీవ్ర ఆందోళనలు చేపట్టాల్సి వస్తుందని హెచ్చరించారు.ఈ కార్యక్రమంలో సిపిఐ ఎంఎల్ న్యూడెమోక్రసీ నేతలు, ప్రజాసంఘాల ప్రతినిధులు నరేష్, నాగరాజు, జీవన్, సాగర్ తదితరులు పాల్గొన్నారు

## గంజాయి విక్రయిస్తున్న వ్యక్తి రిమాండ్

జీడిమెట్ల, (ప్రజాస్ఫూర్తి) : గంజాయి విక్రయిస్తున్న ఓ వ్యక్తిని పేట్బషీరాబాద్ పోలీసులు అరెస్టు చేసి రిమాండ్కు తరలించారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... జీడిమెట్ల వద్ద డెకాత్లాన్ స్టార్ ఓపెన్ ప్లేస్ దగ్గర ఓ వ్యక్తి అనుమానాస్పదంగా తిరగడంతో అట్టి వ్యక్తిని అదుపులోకి తీసుకొని విచారించగా ఉప్పల్కు చెందిన అంకూరి రవితేజ (21) అతని వద్ద మూడు కిలోల గంజాయి ఉండడంతో స్వాధీన పరచుకుని అరెస్టు చేసి రిమాండ్ కు తరలించారు. అయితే అతనికి గంజాయిని సప్లై చేసిన మున్నా అనే వ్యక్తి పరారీలో ఉన్నాడని పోలీసులు తెలిపారు.

## నాలా డైవర్షన్ పనులను పరిశీలించిన ఎమ్మెల్యే కెపి.వివేకానంద్



జీడిమెట్ల, (ప్రజాస్ఫూర్తి) : నాలా డైవర్షన్ పనులను త్వరితగతిన పూర్తయ్యేలా పనుల్లో వేగం పెంచాలని బిఆర్ఎస్ ఎల్పీ విప్, కుత్బుల్లాపూర్ ఎమ్మెల్యే కెపి.వివేకానంద్ అన్నారు. సుభాష్ నగర్ డివిజన్ ఫాక్స్ సాగర్ లో మురుగునీరు కలవకుండా చెరువును సంరక్షిస్తూ సుమారు 2.40 కోట్ల రూపాయల నిధులతో చేపడుతున్న నాలా డైవర్షన్ పనులను బిఆర్ఎస్ ఎల్పీ విప్, ఎమ్మెల్యే కెపి.వివేకానంద్ సంబంధిత అధికారులతో కలిసి శుక్రవారం క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఫాక్స్ సాగర్ లో మురుగు నీరు కలవకుండా ఎగువ ప్రాంతం నుంచి వస్తున్న కాలనీలోని మురుగును డైవర్షన్ చేసేందుకు చేపడుతున్న పనులు దాదాపు డెబ్బై శాతం పూర్తయ్యాయన్నారు. మిగిలి ఉన్న పనులను త్వరితగతిన పూర్తి చేసినట్లయితే చెరువు పరిరక్షణతో పాటు మత్స్యసంపద పెంపొందించడంతో పాటు ఆహ్లాదకర వాతావరణాన్ని ఏర్పాటుచేయవచ్చనని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఇరిగేషన్ ఏఈ రామా రావు, మాజీ కార్పొరేటర్ సురేష్ రెడ్డి, డివిజన్ అధ్యక్షులు పోలే శ్రీకాంత్, పుష్పాల భాస్కర్, సీనియర్ నాయకులు గుబ్బల లక్ష్మీనారాయణ, ఫెరోజ్, దుర్గా రావు, ఇస్మాయిల్, కుంట సిద్ధిరాములు, కమలాకర్, తోకల నగేష్ రెడ్డి, మధు మోహన్ తదితరులు పాల్గొన్నారు.

## కాంగ్రెస్ హయాంలో డ్రైవర్ల బ్రతుకులు అయోమయం

* బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు చిమ్ముల గోవర్ధన్ రెడ్డి
* ఆటో యూనియన్ జెండా ఆవిష్కరణ, భారీ ర్యాలీ

జిన్నారం,ప్రజాస్ఫూర్తి 12: కాంగ్రెస్ హయాంలో ఆటో డ్రైవర్ల పరిస్థితి పూర్తిగా అయోమయంగా మారిందని బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు చిమ్ముల గోవర్ధన్ రెడ్డి విమర్శించారు. సంగారెడ్డి జిల్లా గుమ్మడిదల మండల కేంద్రంలో బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు చిమ్ముల గోవర్ధన్ రెడ్డి ఆధ్వర్యంలో బీఆర్ఎస్ అనుబంధ సంస్థ బిఆర్టియు ఆటో అసోసియేషన్ జెండా ఆవిష్కరణ ఘనంగా నిర్వహించారు. అనంతరం గుమ్మడిదల ప్రధాన వీధుల గుండా ఆటో ర్యాలీ నిర్వహించగా, ఆటో యజమానులు, డ్రైవర్లు భారీ సంఖ్యలో పాల్గొని ర్యాలీని విజయవంతం చేశారు.అనంతరం గోవర్ధన్ రెడ్డి మాట్లాడుతూ కాంగ్రెస్ హయాంలో ఆటో డ్రైవర్ల పరిస్థితి పూర్తిగా అయోమయంగా మారిందని విమర్శించారు. మహిళలకు ఉచిత బస్ సౌకర్యం కల్పించడంతో పాటు ఆటో డ్రైవర్లకు నెలకు 12 వేల రూపాయలు జీతం అందిస్తామని కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల సమయంలో హామీ ఇచ్చినా, నేటివరకు అమలు చేయకపోవడం సిగ్గుచేటని ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. బీఆర్ఎస్ పార్టీ ఎల్లప్పుడూ కూలీలు, కార్మికులు, ఆటో డ్రైవర్ల సంక్షేమం కోసం కృషి చేస్తుందని, డ్రైవర్లు సంఘటితంగా ముందడుగు వేస్తేనే ప్రభుత్వాలు పట్టించుకుంటాయని ఆయన పిలుపునిచ్చారు. త్వరలోనే ఆటో డ్రైవర్లందరికీ బీమా సౌకర్యం కల్పించేందుకు బీఆర్ఎస్ చర్యలు తీసుకుంటుందని హామీ ఇచ్చారు.



కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షులు కొత్తపల్లి ప్రభాకర్ రెడ్డి, మాజీ సర్పంచ్ లు నరసింహారెడ్డి, హనుమంత్ రెడ్డి, రాజశేఖర్, శ్రీనివాస్ రెడ్డి, వేణు, నాయకులు దేవేందర్ రెడ్డి,తుపాకుల రాజు, వెంకట్రాంరెడ్డి, సత్యనారాయణ, మహిపాల్ రెడ్డి, రుక్మారెడ్డి, ఆంజనేయులు, గోపాల్,మురళి,ప్రకాష్, గణేష్,చక్రపాణి, రమేష్, ఆటో అసోసియేషన్ అధ్యక్షుడు శివకుమార్, ప్రధాన కార్యదర్శి వీర, అశ్వక్ ఖాన్, వెంకటేష్, శ్రీకాంత్ లక్ష్మీపతి, శివ, రమేష్, దయానంద్, స్థానిక నాయకులు, ఆటో యజమానులు, డ్రైవర్లు పాల్గొన్నారు.

## భగత్ సింగ్ ఆశయాల సాధనకు సమిష్టిగా కృషిచేద్దాం

* ఐఓసి అంతర్జాతీయ అధ్యక్షులు మొహిందర్ సింగ్ గిల్జెన్

ప్రజా స్ఫూర్తి,భద్రాద్రి కొత్తగూడెం: దేశ స్వాతంత్ర్యం కోసం ప్రాణాలకు తెగించి పోరాడి చిరు ప్రాయంలోనే ప్రాణ త్యాగం చేసిన సర్దార్ భగత్ సింగ్ ఆశయాల సాధనకు సమిష్టిగా కృషి చేద్దామని ఐఓసి అంతర్జాతీయ అధ్యక్షులు మొహిందర్ సింగ్ గిల్ గిల్జెన్ అన్నారు. కొత్తగూడెం పర్యటన సందర్భంగా శుక్రవారం సిపిఐ జిల్లా కార్యాలయం 'శేషగిరిభవన్'లో పట్టణంలోని సిక్కు కుటుంబాలతో సమావేశమయ్యారు, భగత్ సింగ్ యూత్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో జరిగిన సదస్సులో సిక్కు కుటుంబాలను ఉద్దేశించి అయన మాట్లాడుతూ సుక్కు జాతికి భారత దేశమంటే ప్రాణమని, దేశంకోసం తమ ప్రాణాలను సైతం లెక్కచేయని పోరాట పటిమ ఉన్నవారన్నారు. పంజాబ్ రాష్ట్రము నుంచి ఉపాధికోసం భద్రాద్రి జిల్లాకు, కొత్తగూడెం పట్టణానికి వలసవచ్చిన సిక్కు కుటుంబాలకు అండగా ఉంటానని, వారి సమస్యల పరిష్కారంకోసం ప్రభుత్వంతో చర్చిస్తానని తెలిపారు. ఈ ప్రాంతంలో స్థిరపడిన సిక్కు కుటుంబాలు ఆర్థికంగా, రాజకీయంగా ఎదగాలని, అన్నిరంగాల్లో రాణించాలని సూచించారు. సిపిఐ జిల్లా



కార్యదర్శి ఎస్ కె సాబీర్ పాషా మాట్లాడుతూ సిక్కు కుటుంబాలకు అనాదిగా సిపిఐ అండగా ఉంటుందని, వారికి ఏ కష్టమొచ్చినా ఆదుకునేందుకు సిద్ధంగా ఉన్నామన్నారు. ప్రభుత్వం నుంచి వారికి రావాల్సిన సంక్షేమ పథకాలు అందించేందుకు కృషిచేస్తున్నామని తెలిపారు. ఐఓసి అంతర్జాతీయ అధ్యక్షులు మొహిందర్ సింగ్ గిల్ గిల్జెన్ శాలువాలు, పూలమాలలతో ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో ఐఓసి సభ్యులు నల్లా సురేష్, రెడ్డి, వెంకటేష్ రెడ్డి, సందీపట్ల శ్రీనివాసరెడ్డి, మధుసూదన్ రెడ్డి, సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు కంచర్ల జమలయ్య, వాసిరెడ్డి మురళి, నాయకులు భూక్య శ్రీనివాస్, మాచర్ల శ్రీనివాస్, ధర్మరాజు, యూసుఫ్, బోయిన విజయకుమార్, సత్యనారాయణాచారి, నేరెళ్ల శ్రీనివాస్, దుర్గ, ఫెడరేషన్ నాయకులు పున్నం సింగ్ తదితరులు పాల్గొన్నారు.

## విద్యార్థులను సన్మార్గంలో నడిపించే బాధ్యత ఉపాధ్యాయులపై ఉంది



* బిఆర్ఎస్ ఎల్పీ విప్, కుత్బుల్లాపూర్ ఎమ్మెల్యే కెపి.వివేకానంద్

కుత్బుల్లాపూర్, (ప్రజాస్ఫూర్తి ) : విద్యార్థులను సన్మార్గంలో నడిపించే బాధ్యత ఉపాధ్యాయులపై ఉందని బిఆర్ఎస్ ఎల్పీ విప్, కుత్బుల్లాపూర్ ఎమ్మెల్యే కెపి.వివేకానంద్ అన్నారు. టీచర్స్ డే దినోత్సవాన్ని పురస్కరించుకొని సూరారం డివిజన్ సూరారం గ్రామంలోని వీఐపీ ఫంక్షన్ హాల్ నందు తెలంగాణ రికగ్నైజ్డ్ అఫర్డబుల్ ప్రైవేట్ స్కూల్స్ (టీఆర్ఏపిఎస్ఏ) అసోసియేషన్ అధ్వర్యంలో నిర్వహించిన "ప్రేరణ పురస్కార్" కార్యక్రమానికి బిఆర్ఎస్ ఎల్పీ విప్, ఎమ్మెల్యే కెపి.వివేకానంద్ ముఖ్యఅతిథిగా హాజరై విద్యాబోధనలో ఉత్తమ ప్రతిభ కనబరిచిన 120 మంది ఉపాధ్యాయిని, ఉపాధ్యాయులకు బహుమతులను ప్రధానం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ. సమాజంలోని ప్రతి వ్యక్తిని తీర్చిదిద్దే వృత్తి ఉపాధ్యాయ వృత్తే నన్నారు. విద్యార్థులను చదువుతో పాటు సంస్కారవంతంగా తీర్చిదిద్దడంలో గురువులతో పాటు తల్లిదండ్రుల పాత్ర ఎంతో కీలకమన్నారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ మంత్రి సత్యనారాయణ, హేమలత సురేష్ రెడ్డి, టీఆర్ఏపిఎస్ఏ చైర్మన్ వెంకటేష్, ప్రెసిడెంట్ వినోద్ జాదవ్, కార్యదర్శి దయాకర్, కోశాధికారి శ్రీశైలం, ముఖ్య సలహాదారులు ప్రవీణ్ రెడ్డి, నర్సింహులు, రాష్ట్ర & జిల్లా ట్రస్మ ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

## అహ్మద్‌గూడా డబుల్ బెడ్‌రూమ్ (డిగ్నిటీ హౌసింగ్ కాలనీ)

కో-ఆపరేటివ్ సొసైటీ ఎన్నికల నామినేషన్ ప్రక్రియ సజావుగా సాగింది



మల్కాజ్గిరి, ప్రజాస్ఫూర్తి : అహ్మద్‌గూడాలోని డబుల్ బెడ్‌రూమ్ (డిగ్నిటీ హౌసింగ్ కాలనీ) కోఆపరేటివ్ సొసైటీలో జరిగిన ఎన్నికల నామినేషన్ ప్రక్రియ శాంతియుతంగా, సజావుగా సాగింది. ఈ సొసైటీ, పేదలకు డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లు కేటాయించే ప్రభుత్వ పథకంలో భాగంగా ఏర్పడినది, ఇక్కడి నివాసులు కలిసి పనిచేసి కాలనీ అభివృద్ధికి కృషి చేస్తూ వస్తున్నారు. ముఖ్యంగా, 30వ బ్లాక్‌కు చెందిన 9 మంది నివాసులు కలిసికట్టుగా నామినేషన్ పత్రాలు సమర్పించడం అందరినీ ఆకటుకుంది. "ఇది నిజమైన ఐకమత్యం యొక్క చిహ్నం. ఇలాంటి దృశ్యాలు మన కాలనీలో ఎక్కువగా కనిపించాలి" అని ఒక స్థానికుడు చెప్పుకొచ్చాడు. ఈ సందర్భంగా 30వ బ్లాక్ సభ్యులు మాట్లాడుతూ, "మేము కలిసి కట్టుగా ఉండి, మన బ్లాక్ అభివృద్ధికి తోడ్పడాలని కోరుకుంటున్నాం. ఎలాంటి అవకతవకలకు పాల్పడకుండా నిస్వార్థంగా పని చేస్తామని లబ్ధిదారులు అందరికి జవాబు దారిగా ఉంటూ రోడ్లు, విద్యుత్, నీటి సౌకర్యాలు మెరుగుపరచడం, పిల్లల విద్య, మహిళల భద్రతలకు ప్రాధాన్యత ఇవ్వాలనేది మా లక్ష్యం" అని తెలిపారు. ఈ ఐక్యత ద్వారా సొసైటీలోని ఇతర బ్లాక్‌లు కూడా ప్రేరణ పొందినట్టుగా కనిపిస్తోంది. ఎన్నికల ప్రక్రియలో ఎలాంటి ఘర్షణలు లేకపోవడం, అధికారుల సహకారంతో సరళంగా సాగడం కూడా ప్రశంసనీయం. ఈ యొక్క కార్యక్రమంలో, మేరీ, సీత, షహీదా బేగం,లత, రేణుక, జంగిలి సువర్ణ, స్వప్న, మమత, సంతోషి, సుశీల, అలాగే బ్లాక్ సబ్బులు అందరూ పాల్గొన్నారు.

## 9 నెలలుగా వేతనాలు రాక సమ్మెకు దిగిన ఎస్టీ పోస్ట్ మెట్రిక్ గర్ల్స్ హాస్టల్ వర్కర్స్



ప్రజా స్ఫూర్తి, భద్రాద్రి కొత్తగూడెం: కొత్తగూడెం మండలం, కొత్తగూడెం నగరపాలక సంస్థ పరిధిలోని 2వ నెంబర్ బస్తీలో ఉన్న ఎస్టీ పోస్ట్ మెట్రిక్ గర్ల్స్ హాస్టల్‌లో పనిచేస్తున్న వర్కర్లు గత తొమ్మిది నెలలుగా వేతనాలు రాక సమ్మె ప్రారంభించారు.సమ్మె శిబిరాన్ని ఏఐటియుసి-సిపిఐ పట్టణ ప్రతినిధి బృందం శుక్రవారం సందర్శించి కార్మికులకు సంఘీభావం తెలియజేసింది. ఈ సందర్భంగా ఏఐటియుసి జిల్లా అధ్యక్షులు కంచర్ల జమలయ్య మాట్లాడుతూ "వేతనాలు ఇవ్వకపోగా వారితోనే వెట్టిచాకరు చేస్తున్న కాంట్రాక్టు ఏజెన్సీని తక్షణమే రద్దు చేసి, ప్రభుత్వమే వర్కర్లను నేరుగా నియమించి ప్రభుత్వ జీవ ప్రకారం వేతనాలు చెల్లించాలి అని డిమాండ్ చేశారు.అలాగే కార్మికులు కక్ష సాధింపుకు పోకుండా, వారి కుటుంబాలు పస్తులు ఉండటంవల్లనే సమ్మెకు దిగారని ప్రభుత్వాధికారులు గుర్తించాలి అని జమలయ్య సూచించారు.ఈ ధర్నా కార్యక్రమంలో సిపిఐ పట్టణ సహాయ కార్యదర్శి మాచర్ల శ్రీనివాస్, కొల్లాపూరి ధర్మరాజు, టౌన్ ఏరియా కార్యదర్శి, సహాయ కార్యదర్శి ఎం.డి. యూసుఫ్, బోయిన్ విజయ్ కుమార్, పోలోజు సత్యనారాయణ చారి 15వ డివిజన్ కార్యదర్శి రాకేష్‌తో కలిసి సిపిఐ నాయకులు అజీజ్, మహిళా సమైక్య నాయకురాలు పుట్ట భాగ్యలక్ష్మి, రెండో నెంబర్ బస్తి మాజీ మున్సిపల్ కౌన్సిలర్ కొక్కిలిగడ్డ రామకృష్ణ, రామారావు ఏరియా 6 వార్డుల ఇన్చార్జి కార్యదర్శి, మండల రాజేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

# ట్రిబుల్ ఆర్ లో భూములు కోల్పోతున్న రైతులకు.. ప్రభుత్వం న్యాయం చేయాలి

* **ఆర్డీవో కార్యాలయం ముందు ట్రిబుల్ ఆర్ భూ నిర్వాసితుల ధర్నా, జాతీయ రహదారిపై రాస్తారోకో**
- **కాసేపు ఉద్రిక్తత నెలకొనడంతో, అరెస్టు చేసి పోలీస్ స్టేషన్ కు తరలించిన స్థానిక పోలీసులు**
- **ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం**









చౌటుప్పల్, ప్రజాస్ఫూర్తి: ట్రిబుల్ ఆర్ లో భూములు కోల్పోతున్న రైతులకు.. ప్రభుత్వ భూములు ఇచ్చి.. భూ నిర్వాసితులకు ప్రభుత్వం న్యాయం చేయాలని ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం డిమాండ్ చేశారు. చౌటుప్పల్ మండల కేంద్రంలోని ఆర్డీవో కార్యాలయం ఎదుట ట్రిబుల్ ఆర్ భూ నిర్వాసితులు పెద్ద పెద్ద ఎత్తున శుక్రవారం ధర్నా కార్యక్రమం నిర్వహించారు. ఈ ధర్నాకు ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం, మాజీ ఎమ్మెల్యేలు కూసుకుంట్ల ప్రభాకర్ రెడ్డి, పల్లా వెంకట్ రెడ్డి, మాజీ ఎమ్మెల్సీ చెరుపల్లి సీతారాములు, బిజెపి రాష్ట్ర ఉపాధ్యక్షుడు గంగిడి మనోహర్ రెడ్డి తదితరులు పాల్గొని భూ నిర్వాసితుల ధర్నాకు సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం మాట్లాడుతూ ఎన్నో సంవత్సరాల నుంచి భూములనే నమ్ముకుని వ్యవసాయం చేస్తున్న రైతులకు ట్రిబుల్ ఆర్ వల్ల పూర్తిగా నష్టం జరుగుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. రైతులు బాగుంటేనే దేశం బాగుంటుందని, రైతులకు అన్యాయం జరగకుండా భూమికి బదులు భూమి ఇవ్వాలని, లేనిచో రైతులు కోల్పోతున్న భూమిలకు మార్కెట్ ధర చెల్లించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఒక బడా దివిస్ పరిశ్రమ వల్ల
అలైన్మెంట్ ను మార్చి రైతుల పొట్ట కొట్టడం సబబు కాదని ఆరోపించారు. ప్రభుత్వం భూములు కోల్పోతున్న రైతులకు ఎంత నష్టపరిహారం చెల్లించినా, అది తక్కువనే అవుతుందన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు న్యాయం జరిగేలా చూడాలన్నారు. ట్రిబుల్ ఆర్ లో భూములు కోల్పోతున్న రైతులకు సిపిఐ పార్టీ అండగా ఉంటుందన్నారు. న్యాయం జరిగేంత వరకు పోరాటం చేయడానికి సిద్ధంగా ఉన్నామన్నారు.

**ట్రిబుల్ ఆర్ భూ నిర్వాసితులకు న్యాయం జరిగేంత వరకు వారికి అండగా ఉంటా**

మాజీ ఎమ్మెల్యే కూసుకుంట్ల ప్రభాకర్ రెడ్డి

ట్రిబుల్ ఆర్ భూ నిర్వాసితులకు న్యాయం జరిగేంతవరకు వారికి అండగా ఉంటానని మునుగోడు మాజీ ఎమ్మెల్యే కూసుకుంట్ల ప్రభాకర్ రెడ్డి హామీ ఇచ్చారు. భూ నిర్వాసితుల ధర్నాకు సంఘీభావంగా హాజరై, మాట్లాడారు ట్రిబుల్ ఆర్ లో భాగంగా దక్షిణ బాగానా అలైన్మెంట్ మార్చి, ఉత్తర భాగాన అలైన్మెంట్ మార్చకపోవడంలో ఆంతర్యం ఏముందని ప్రశ్నించారు. దివీస్ పరిశ్రమ యాజమాన్యంతో ఒప్పందం కుదుర్చుకొని రైతులను రోడ్డు మీదకు లాగుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఎన్నికలలో ట్రిబుల్ ఆర్ బాధితులకు హామీ ఇచ్చిన మునుగోడు ఎమ్మెల్యే, నల్లగొండ జిల్లా మంత్రి ఇద్దరు ఇచ్చిన హామీలను తుంగలో తొక్కారని ఆరోపించారు. మునుగోడు ఎమ్మెల్యేకి మంత్రి పదవి ముఖ్యమని, రైతుల గోస పట్టదని ఆరోపించారు. మునుగోడు ఎమ్మెల్యే పగలు ప్రభుత్వాన్ని తిడుతూ, రాత్రి మంత్రి పదవి కోసం ముఖ్యమంత్రి కాళ్లు పట్టుకుంటున్నారని ఆరోపించారు. రైతులకు ఇచ్చిన మాట కోసం ముఖ్యమంత్రి కాళ్లు పట్టుకున్నా తప్పు లేదన్నారు. రైతులను మోసం చేసిన ఎవరికైనా, ఏ ప్రభుత్వానికైనా పుట్టగతులు ఉండవని దుయ్యబట్టారు. బీఆర్ఎస్ పార్టీ రైతులకు అండగా ఉంటుందన్నారు. ట్రిబుల్ ఆర్ భూనిర్వాసితులకు న్యాయం జరిగేంత వరకు అండగా ఉంటానమన్నారు. అలైన్మెంట్ మార్చే వరకు భూ నిర్వాసితుల పోరాటంలో భాగస్వామ్యం అవుతామన్నారు.

* **పెద్దల భూములను కాపాడడం కోసమే.. చిన్న, సన్న కారు రైతులను రాష్ట్ర ప్రభుత్వం మోసం చేస్తుంది:**
- **బిజెపి రాష్ట్ర ఉపాధ్యక్షుడు గంగిడి మనోహర్ రెడ్డి**

పెద్దల భూములను కాపాడడం కోసమే తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం చిన్న, సన్న కారు రైతులను మోసం చేస్తున్నదని బిజెపి రాష్ట్ర ఉపాధ్యక్షుడు గంగిడి మనోహర్ రెడ్డి అన్నారు. ఉత్తర, దక్షిణ భాగాలకు ఒకటే అలైన్మెంట్ ఉండాలని రాష్ట్ర ప్రభుత్వానికి సూచించారు. భూ సేకరణ రాష్ట్ర ప్రభుత్వం ఆధీనంలోనే ఉందని, నిజంగా రైతుల పక్షాన కాంగ్రెస్ ప్రభుత్వం ఉంటే, అలైన్మెంట్ మార్చి రైతులకు సరైన మార్కెట్ ధర ఇప్పించాలని డిమాండ్ చేశారు. రైతులకు సరైన మార్కెట్ ధర ఇప్పిస్తే, కాంగ్రెస్ నాయకులకు తానే పాలాభిషేకం చేస్తానన్నారు. 2013భూసేకరణ చట్టం ప్రకారం ట్రిబుల్ ఆర్ లో భూములు కోల్పోతున్న రైతులకు భూమికి బదులు భూమి, లేనిచో భూమికి సరైన ధర చెల్లించాలని డిమాండ్ చేశారు. రైతులకు న్యాయం జరిగేంతవరకు బిజెపి రాష్ట్ర నాయకత్వం రైతులకు అండగా ఉంటుందని హామీ ఇచ్చారు. మాజీ ఎమ్మెల్యే పల్లా వెంకట్ రెడ్డి మాట్లాడుతూ ఓ ఆర్ ఆర్ కి సంబంధించి భూమిని ఎలా తీసుకున్నారో, ట్రిబుల్ ఆర్ లో కూడా రైతులకు పూర్తిగా న్యాయం చేసి వారి వద్ద నుండి భూములను తీసుకోవాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. భూ నిర్వాసితులకు భూమికి బదులు భూమిని ప్లాట్లకు బదులు ప్లాట్లు లేదా ప్రస్తుత మార్కెట్ ధర ఇవ్వాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు. అనంతరం ఆర్డీవో శేఖర్ రెడ్డికి వినతిపత్రం అందజేశారు. ఆర్డీవో కార్యాలయం నుంచి పెద్ద ఎత్తున జాతీయ రహదారిపై ర్యాలీగా వెళ్లి, రాస్తారోకో నిర్వహించారు. రోడ్డుపై కాస్త ఉద్రిక్తత నెలకొనడంతో పోలీసులు నిర్వాసితులను అరెస్టు చేసి పోలీస్ స్టేషన్ కు తరలించారు. ఈ కార్యక్రమంలో చౌటుప్పల్ సింగిల్ విండో మాజీ చైర్మన్ చింతల దామోదర్ రెడ్డి, బిజెపి మండల పార్టీ అధ్యక్షుడు కైరంకొండ అశోక్, బీఆర్ఎస్ మండల పార్టీ అధ్యక్షుడు గిర్కాటి నిరంజన్ గౌడ్, రాష్ట్ర రైతు సంఘం నాయకుడు బూరుగు కృష్ణారెడ్డి, చౌటుప్పల్ వ్యవసాయ మార్కెట్ మాజీ చైర్మన్ బొడ్డు శ్రీనివాస్ రెడ్డి, అధిక సంఖ్యలో ట్రిబుల్ ఆర్ భూ నిర్వాసితులు పాల్గొన్నారు.

## వేతన జీవుల వెతలు

* **గత దశాబ్ద కాలం నుంచి పని చేస్తున్న వర్కర్స్ కు పర్మినెంట్ చేయాలి**
* **ఆరు నెలలుగా జీతాలు లేక జీవితాలు దుర్భరం**



ప్రజా స్ఫూర్తి ,భద్రాద్రి కొత్తగూడెం: గిరిజన ఆశ్రమ పాఠశాలల హాస్టల్లో పనిచేస్తున్న డైలీ వేజ్ కాంటింజెంట్ వర్కర్ల సమస్యల పరిష్కారం కొరకై శుక్రవారం పాల్వంచ మండలంలోని పలు ఆశ్రమ పాఠశాల ఎస్ టి హాస్టల్ లలో పని చేస్తున్న డైలీ వేజ్ వర్కర్లు నిరవధిక సమ్మెను మొదలు పెట్టారు.ఈ సందర్భంగా కార్మికులు మాట్లాడుతూ.. వర్కర్లను పర్మినెంట్ చేయాలి,టైం స్కేల్ పెంచాలనీ..ఇప్పటివరకు జిల్లా కలెక్టర్ గెజిటెడ్ ప్రకారం జీతాలు చెల్లించాలి, మరణించిన వారి స్థానంలో కుటుంబ సభ్యులకు పని కల్పించాలి.పూర్తి కాలం పనిచేస్తున్న వారందరికీ పూర్తి వేతనాలు ఇవ్వాలని,పలు డిమాండ్లతో కూడిన నిరావధిక సమ్మెను చేపట్టినట్లు, మా డిమాండ్లు పరిష్కారం అయ్యేవరకు హాస్టల్లో వంట బంద్ చేస్తున్నామని తెలిపారు. జీఓ 64 తో తమ వేతనం సగానికి సగం తగ్గుతుందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఈజీఓ అమలైతే.. ప్రస్తుతం నెలకు రూ.26వేలు పొందే కార్మికుడి వేతనం.. రూ.11,700కు పడిపోవచ్చని తెలుస్తోంది.ఈ జీఓ అమలు చేయొద్దని,తమ పెండింగ్ వేతనాలు చెల్లించాలని డిమాండ్ చేశారు. ఈ సమ్మెకు ఎ టి ఈ సి జిల్లా అధ్యక్షులు మాలోత్ బాలు నాయక్ , గిరిజన ఉపాధ్యాయుల రాష్ట్ర నాయకులు రాములు నాయక్ సంఘీభావం మద్దతు తెలిపారు.

## గంజాయి విక్రయిస్తున్న వ్యక్తి రిమాండ్



జీడిమెట్ల, (ప్రజాస్ఫూర్తి) : గంజాయి విక్రయిస్తున్న ఓ వ్యక్తిని పేట్బషీరాబాద్ పోలీసులు అరెస్టు చేసి రిమాండ్కు తరలించారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... జీడిమెట్ల వద్ద డెకాత్లాన్ స్టోర్ ఓపెన్ ప్లేస్ దగ్గర ఓ వ్యక్తి అనుమానాస్పదంగా తిరగడంతో అట్టి వ్యక్తిని అదుపులోకి తీసుకొని విచారించగా ఉప్పల్కు చెందిన అంకూరి రవితేజ (21) అతని వద్ద మూడు కిలోల గంజాయి ఉండడంతో స్వాధీన పరచుకుని అరెస్టు చేసి రిమాండ్ కు తరలించారు. అయితే అతనికి గంజాయిని సప్లై చేసిన మున్నా అనే వ్యక్తి పరారీలో ఉన్నాడని పోలీసులు తెలిపారు.




## రాజ్యాంగ పరిరక్షణ కోసం పోరాడటమే సీతారాం ఏచూరికిచ్చే ఘన నివాళి

* **సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు పోతినేని సుదర్శన్**

ప్రజా స్ఫూర్తి,భద్రాద్రి కొత్తగూడెం: భారత రాజ్యాంగ పరిరక్షణ కోసం పోరాడటమే సిపిఎం జాతీయ నాయకుడు, మాజీ ఎంపీ, అమరజీవి కామ్రేడ్ సీతారాం ఏచూరి కి ఇచ్చే నిజమైన ఘన నివాళి అని సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు పోతినేని సుదర్శన్ పేర్కొన్నారు.జిల్లా కార్యదర్శి మచ్చ వెంకటేశ్వర్లు అధ్యక్షతన జరిగిన ఏచూరి ప్రథమ వర్ధంతి సభలో ఆయన పాల్గొని, ఏచూరి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం సుదర్శన్ మాట్లాడుతూ భారత రాజకీయ రంగంపై చెరగని ముద్ర వేసిన మహానుభావుడు ఏచూరి, జీవితాంతం కమ్యూనిస్టు ఆశయాలను నిలబెట్టిన మహోన్నత వ్యక్తి అని అన్నారు. రాజ్యాంగ లౌకిక విలువలను కాపాడేందుకు అన్ని లౌకిక శక్తులను ఒక త్రాటిమీదకు తేవడంలో ఆయన ప్రత్యేక పాత్ర పోషించారని పేర్కొన్నారు.ఎమర్జెన్సీ కాలంలోనే ధైర్యంగా పోరాడిన యోధుడు, ప్రపంచ ప్రఖ్యాతి గాంచిన తెలుగుతేజం సీతారాం ఏచూరి అని సుదర్శన్ ప్రశంసించారు. బిజెపి, ఆరెస్సెస్‌లు రాజ్యాంగంపై చేస్తున్న దాడులను ఏచూరి దేశవ్యాప్తంగా బట్టబయలు చేశారని, అనేక ఉద్యమాలకు నాయకత్వం వహించారని గుర్తుచేశారు.దేశ అభివృద్ధి కోసం ప్రభుత్వ రంగ సంస్థలను కాపాడాలని, సహజ వనరుల దోపిడీకి వ్యతిరేకంగా పోరాడిన ప్రజానాయకుడు ఏచూరి అని అన్నారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లాతో ఆయనకు ప్రత్యేక అనుబంధం ఉందని గుర్తుచేశారు.ఈ సందర్భంగా సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ఎం.జ్యోతి, లిక్కి బాలరాజు, అన్నవరపు సత్యనారాయణ, రేపాకుల శ్రీనివాస్ తదితరులు ప్రసంగించారు. ఈ కార్యక్రమంలో జిల్లా కమిటీ సభ్యులు కొండపల్లి శ్రీధర్, వీర్ల రమేష్, కున్సోత్ ధర్మా, కొండబోయిన వెంకటేశ్వర్లు, వాంకుడోత్ కోబల్, పాల్వంచ పట్టణ కార్యదర్శి పి. తులసీరాం, మండల కార్యదర్శులు పి. వెంకట్రావు, ఈసం నర్సింహారావు, నాయకులు ఎస్. లక్ష్మి, చిటికెన ముసలయ్య, కాత్రాల తిరుపతి, చందర్ రావు, గండమాల భాస్కర్, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

## మనకు జీవాన్ని ఇచ్చే దైవం తల్లిదండ్రులైతే, జ్ఞానాన్ని పంచే దైవం ఉపాధ్యాయులు

* **బిఆర్ఎస్ ఎల్పీ విప్, కుత్బుల్లాపూర్ ఎమ్మెల్యే కెపి.వివేకానంద్**

కుత్బుల్లాపూర్, (ప్రజాస్ఫూర్తి) : మనకు జీవాన్ని ఇచ్చే దైవం తల్లిదండ్రులైతే, జ్ఞానాన్ని పంచే దైవం ఉపాధ్యాయులని బిఆర్ఎస్ ఎల్పీ విప్, కుత్బుల్లాపూర్ ఎమ్మెల్యే కెపి. వివేకానంద్ అన్నారు. శుక్రవారం దుండిగల్ మున్సిపాలిటీ పరిధి బహదూర్ పల్లి లోని మేకల వెంకటేష్ ఫంక్షన్ హాల్ నందు ఉపాధ్యాయ దినోత్సవాన్ని పురస్కరించుకొని నిర్వహించిన మండల స్థాయి ఉత్తమ ఉపాధ్యాయ పురస్కార ప్రధానోత్సవ కార్యక్రమానికి బిఆర్ఎస్ ఎల్పీ విప్, ఎమ్మెల్యే కెపి.వివేకానంద్ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. అనంతరం విద్యాబోధనలో ఉత్తమ ప్రతిభ కనబరిచిన ఉపాధ్యాయులకు ఎమ్మెల్యే చేతుల మీదుగా అవార్డులను ప్రధానం చేశారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ చిన్ననాటి నుండే విద్యార్థుల్లో దాగి ఉన్న ప్రతిభను వెలికి తీసి వారికి మార్గదర్శకులుగా నిలిచేది గురువులేనన్నారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్లు, మండల విద్యాధికారులు, జెమిని కుమారి, క్రిష్ణ, రామకృష్ణ, పీఆర్టీయూ, టీఎస్టీయూ, ఎస్టీయూ సంఘాల అధ్యక్ష, కార్యదర్శులు, ఉపాధ్యాయిని, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.



## టీవీఆర్ గ్రూప్ ఆఫ్ స్కూల్స్ లో హిందీ భాషా దినోత్సవ ఉత్సవాలు





జీడిమెట్ల, (ప్రజాస్ఫూర్తి) : కుత్బుల్లాపూర్ సర్కిల్ సుభాష్ నగర్ డివిజన్ పరిధిలోని అపురూప కాలనీ లో గల టీవీఆర్ మోడల్ హైస్కూల్ లో, ఎస్ ఆర్ నాయక్ నగర్లో గల సత్యవాణి విద్యా నికేతన్ హై స్కూల్ లో శుక్రవారం హిందీ భాషా దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా టీవీఆర్ గ్రూప్ ఆఫ్ స్కూల్స్ మేనేజింగ్ డైరెక్టర్ టి. వంశీ కృష్ణారెడ్డి పాల్గొని మాట్లాడుతూ విద్యార్థిని విద్యార్థులు హిందీ భాష గొప్పతనాన్ని స్వాతంత్ర ఉద్యమంలో ముఖ్య భూమిక పోషించిన భాష హిందీ అని అన్నారు. 1949 సెప్టెంబర్ 14 న జాతీయ (దేశ ) భాష గా గుర్తించబడింది నాటి నుండి యావత్ భారతదేశం హిందీ దివస్ గా హిందీ భాష దినోత్సవం గా జరుపుకుంటున్నామన్నారు. అనంతరం సమరయోధులు అవలంబించిన భాష హిందీ భాష జాతీయ భాష గాన గంధర్వులైన మీరాబాయి, తులసీదాస్ వేషధారణ , ఏకపాత్రాభినయం, నృత్య నాటికలు, హిందీ చారిత్రక గీతాలు దేశ చరిత్రను తిరగరాసిన సన్నివేశాలను కళ్లకు కట్టినట్టు విద్యార్థిని విద్యార్థులు ప్రదర్శించారు. అదే విధంగా విద్యార్థిని విద్యార్థులకు డ్రాయింగ్ , పెయింటింగ్ కాంపిటీషన్స్ పెట్టి బహుమతులు అందజేశారు. టీవీఆర్ గ్రూప్ ఆఫ్ స్కూల్స్ చైర్మన్ టి. కోటిరెడ్డి, అకాడమిక్ డైరెక్టర్ దీప్తి రెడ్డి విద్యార్థులను వీరిని తీర్చిదిన్న అధ్యాపకులను అభినందించారు. హిందీ భాష దినోత్సవ శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపల్ ఎం, జయరాజ్, విద్యార్థిని విద్యార్థులు ఉపాధ్యాయ బృందం పాల్గొన్నారు




## ప్రైవేటు పాఠశాల ఉపాధ్యాయులను..

# సత్కరించడం సంతోషంగా ఉంది

* కుత్బుల్లాపూర్ ఎమ్మెల్యే, టిఆర్ఎస్ ఎల్పీ విప్ కేపీ వివేకానంద
* ట్రాపసా ఆధ్వర్యంలో ఉపాధ్యాయులకు ప్రేరణ పురస్కార్

**(ప్రజాస్ఫూర్తి, కుత్బుల్లాపూర్) :** బడ్జెట్ పాఠశాలలో ఉపాధ్యాయులుగా పనిచేస్తున్న వారిని సత్కరించే అవకాశం తనకు దక్కడం అదృష్టంగా భావిస్తున్నానని కుత్బుల్లాపూర్ శాసనసభ్యులు, టిఆర్ఎస్ ఎల్ పి విప్ కీపి వివేకానంద అన్నారు. తెలంగాణ గుర్తింపు పొందిన అఫర్డబుల్ ప్రైవేటు పాఠశాలల యాజమాన్యాల సంఘం (ట్రాపసా) ఆధ్వర్యంలో సూరారం లోని విఐపి ఫంక్షన్ హాల్ లో నిర్వహించిన ఉపాధ్యాయ దినోత్సవ వేడుకలకు ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా 60 ప్రైవేటు పాఠశాలలకు చెందిన 120 మంది ఉపాధ్యాయులను ఘనంగా సత్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ మధ్యతరగతి ప్రజలు అత్యధికంగా నివసించే కుత్బుల్లాపూర్ లో బడ్జెట్ పాఠశాలల పాత్ర అత్యంత కీలకంగా ఉందన్నారు. ఇలాంటి పాఠశాలలో ఉపాధ్యాయులుగా పని చేస్తున్న వారు ఎంతో అంకితభావంతో పనిచేస్తున్నారని కొనియాడారు. బడ్జెట్ పాఠశాలల వల్ల సామాన్యులకు కూడా అత్యున్నత విద్య అందుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. బడ్జెట్ పాఠశాలలో పనిచేస్తున్న ఉపాధ్యాయులను సత్కరించాలనే ఆలోచన గొప్ప విషయం అన్నారు. ఉపాధ్యాయులు మరింత అంకుర దీక్షతో పనిచేసేందుకు దోహదపడుతుందని అభిప్రాయపడ్డారు. కార్యక్రమం నిర్వహించిన ట్రాపసా సభ్యులను అభినందించారు. ఈ సందర్భంగా ప్రముఖ సైకాలజిస్ట్ సుధీర్ సంద్ర ఉపాధ్యాయుని గొప్పతనంపై సుదీర్ఘంగా ప్రసంగించారు. కార్యక్రమంలో కార్పొరేటర్ మంత్రి సత్యనారాయణ, మాజీ కార్పొరేటర్ సురేష్ రెడ్డి, దుండిగల్ ఎం ఈ ఓ కిషన్, ట్రస్మా రాష్ట్ర అధ్యక్షులు ఎస్ ఎన్ రెడ్డి, అసోసియేట్ అధ్యక్షులు రామేశ్వర్ రెడ్డి, కోశాధికారి శ్రీకాంత్ రెడ్డి, ట్రస్మా జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు శ్రీకాంత్ రెడ్డి, ఆంజనేయులు, కోశాధికారి గిరిబాబు, ట్రాపసా చైర్మన్ కోలా వెంకటేష్, కుత్బుల్లాపూర్ అధ్యక్షులు వినోద్ జాదవ్, ప్రధాన కార్యదర్శి దయాకర్, కోశాధికారి శ్రీశైలం, కార్యనిర్వహక కార్యదర్శి మధు, సీనియర్ కరస్పాండెంట్లు నరసింహులు గౌడ్, భూపాల్ రెడ్డి, దుర్గారావు, ప్రవీణ్ రెడ్డి, శ్రీనివాస్ రెడ్డి, సి ఎచ్ నర్సింహాలు గౌడ్, తదితరులు పాల్గొన్నారు.





















# స్టాక్ మార్కెట్ల జోరు...

**వరుసగా ఎనిమిదో రోజూ లాభాలే!**

**అమెరికా ఫెడ్ వడ్డీ రేట్ల కోత అంచనాలతో మార్కెట్లో ఉత్సాహం**

**భారత్-అమెరికా వాణిజ్య చర్చలు, రక్షణ రంగ షేర్లలో కొనుగోళ్లు**

**355 పాయింట్లు పెరిగిన సెన్సెక్స్, 108 పాయింట్ల లాభంతో నిఫ్టీ**

**డాలర్‌తో పోలిస్తే బలపడిన రూపాయి.. 88.27 వద్ద స్థిరపడ్డ విలువ**

**మూడు వారాల గరిష్ఠ స్థాయికి చేరిన జాతీయ మార్కెట్**



**ముంబై:** దేశీయ స్టాక్ మార్కెట్లు వరుసగా ఎనిమిదో రోజు కూడా లాభాల బాట పట్టాయి. అంతర్జాతీయంగా నెలకొన్న సానుకూల పరిణామాలతో శుక్రవారం నాటి ట్రేడింగ్‌లో సూచీలు భారీ లాభాలను నమోదు చేశాయి. దీంతో మార్కెట్లు మూడు వారాల గరిష్ఠ స్థాయికి చేరుకున్నాయి. ట్రేడింగ్ ముగిసే సమయానికి బీఎస్ఈ సెన్సెక్స్ 355.97 పాయింట్లు పెరిగి 81,904.70 వద్ద స్థిరపడింది. అదేవిధంగా, ఎన్ఎస్ఈ నిఫ్టీ 108.50 పాయింట్లు లాభపడి 25,114.0 వద్ద ముగిసింది.

అమెరికా ఫెడరల్ రిజర్వ్ వడ్డీ రేట్లను తగ్గించవచ్చన్న అంచనాలు ప్రపంచవ్యాప్తంగా మార్కెట్లలో కొత్త ఉత్సాహాన్ని నింపాయి. దీనికి తోడు, భారత్-అమెరికా మధ్య వాణిజ్య చర్చలు సానుకూలంగా సాగుతున్నాయన్న వార్తలు ఇన్వెస్టర్ల సెంటిమెంట్‌ను మరింత బలపరిచాయి. రష్యా నుంచి చమురు కొనుగోలు చేస్తున్నందుకు భారత్‌పై అమెరికా ప్రతిపాదించిన టారిఫ్‌లను యూరోపియన్ యూనియన్ తిరస్కరించవచ్చని వస్తున్న నివేదికలు కూడా మార్కెట్‌కు కలిసొచ్చాయని విశ్లేషకులు పేర్కొన్నారు.

అంతేకాకుండా, భారత ప్రభుత్వం ఆరు కొత్త తరం జలాంతర్గాముల కొనుగోలు కోసం చర్చలు ప్రారంభించడంతో రక్షణ రంగ షేర్లకు భారీగా కొనుగోళ్ల మద్దతు లభించింది. సెన్సెక్స్ లో బీఈఎల్, బజాజ్ ఫైనాన్స్, బజాజ్ ఫిన్‌సర్వ్, యాక్సిస్ బ్యాంక్, మారుతీ, టాటా మోటార్స్, ఐసీఐసీఐ బ్యాంక్, ఎల్అండ్‌టీ, ఇన్ఫోసిస్, పవర్‌గ్రిడ్ షేర్లు ప్రధానంగా లాభపడగా.. హిందుస్థాన్ యూనిలీవర్, ఏషియన్ పెయింట్స్, భారతీ ఎయిర్‌టెల్, ఐటీసీ నష్టపోయాయి. ఎఫ్ఎంసీజీ మినహా దాదాపు అన్ని రంగాల సూచీలు లాభాల్లోనే ముగిశాయి.

మరోవైపు, డాలర్‌తో రూపాయి మారకం విలువ కూడా పుంజుకుంది. రూపాయి 0.18 శాతం బలపడి 88.27 వద్ద ముగిసింది. డాలర్ ఇండెక్స్ 98 స్థాయికి దిగువన బలహీనంగా ఉండటం, అమెరికాతో వాణిజ్య చర్చలు సానుకూలంగా సాగడం, ముడి చమురు ధరలు తగ్గడం వంటి అంశాలు రూపాయికి అండగా నిలిచాయని ఎల్‌కేపీ సెక్యూరిటీస్‌కు చెందిన జతీన్ త్రివేది తెలిపారు.

## భారీగా పెరిగిన బంగారం ధరలు..



**హైదరాబాద్:** బంగారం ధరలు భగ్గుమంటున్నాయి. రోజురోజుకు పసిడి ధరలు పెరిగిపోతూనే ఉన్నాయి. అమాంతం పెరిగిన ధరలతో పసిడి ప్రియులు ఉక్కిరిబిక్కిరి అవుతున్నారు. రికార్డు స్థాయిలో ధరలు పెరిగిపోవడంతో ఇవేం ధరలు బాబోయ్ అని అంటున్నారు. హైదరాబాద్ నగరంలో బంగారం ధరలు భారీగా పెరిగిపోయాయి.

హైదరాబాద్ నగరంలో 10 గ్రాముల 22 క్యారెట్ల బంగారం ధర రూ. 1,02,000 ఉండగా, 24 క్యారెట్ల బంగారం ధర రూ. 1,11,280గా ఉంది. నిన్నటి ధరలతో పోల్చితే 22 క్యారెట్ల గోల్డ్ రూ. 700 ఎగబాకగా, 24 క్యారెట్ల బంగారం ధర రూ. 771 ఎగబాకింది. దీంతో గోల్డ్ లవర్స్ ఆగమైపోతున్నారు. ఈ స్థాయిలో ధరలు పెరిగితే బంగారం కొనేదేలా అని ప్రశ్నించుకుంటున్నారు.

ఇక ఈ ఏడాది ఆరంభంతో ఈ ధరలను పోల్చితే.. నేటికి 42 శాతం రెట్టింపు అయ్యాయి గోల్డ్ రేట్స్. జనవరి నెలలో 22 క్యారెట్ల బంగారం ధర రూ. 71,500 ఉండగా, 24 క్యారెట్ల బంగారం ధర రూ. 78 వేలు ఉండే. కానీ ఇప్పుడు ఆ ధరలు 42 శాతం జంప్ కావడంతో బంగారం ప్రియులు లబోదిబోమంటున్నారు.

## ఫ్రీ షేర్లు ప్రకటించిన పతంజలి ఫుడ్స్!

**ఒకటికి రెండు షేర్లు..**




**న్యూఢిల్లీ:** పతంజలి ఫుడ్స్ తన షేర్ హెూల్డర్లకు 2:1 నిష్పత్తిలో బోనస్ షేర్లు ప్రకటించింది. దీని కారణంగా బుధవారం రూ.1,802.25 వద్ద ముగిసిన పతంజలి ఫుడ్స్ షేర్లు. గురువారం ఉదయం రూ.595 వద్ద ట్రేడవుతున్నాయి. ఒక్కరోజులో షేరు ధర ఇంతగా తగ్గడానికి కారణం బోనస్ షేర్ల ప్రకటన. కంపెనీ ఇటీవల 2:1 బోనస్ షేర్లను ఇవ్వాలని నిర్ణయించింది. అంటే ప్రతి షేరుకు మీరు రెండు కొత్త షేర్లను ఉచితంగా పొందుతారు. అంటే మీకు ఇప్పటికే 100 షేర్లు ఉంటే బోనస్ షేర్లను పొందిన తర్వాత మీకు మొత్తం 300 షేర్లు ఉంటాయి.

ఎక్స్-బోనస్ అంటే కంపెనీ బోనస్ షేర్లను ఇవ్వబోయే తేదీ తర్వాత షేర్లను కొనుగోలు చేయడం, కానీ మీకు ఆ బోనస్ హక్కు లభించదు. పతంజలి ఫుడ్స్ జూలై 17, 2025న తన పెట్టుబడిదారులకు 2:1 నిష్పత్తిలో బోనస్ షేర్లను ఇస్తామని చెప్పింది. అంటే మీకు ఒక షేరు ఉంటే మరో రెండు ఉచిత షేర్లు లభిస్తాయి. దీని కోసం కంపెనీ సెప్టెంబర్ 11, 2025న రికార్డ్ తేదీని ఉంచింది. సెప్టెంబర్ 11 వరకు తమ షేర్లను కలిగి ఉన్న పెట్టుబడిదారులు ఈ బోనస్‌కు అర్హులు అవుతారు. కానీ ఈ తేదీ తర్వాత షేర్లను కొనుగోలు చేసే వారికి బోనస్ షేర్లు లభించవు. ఈ మొత్తం ప్రక్రియ సాంకేతికమైనది, ఇది దీర్ఘకాలికంగా పెట్టుబడిదారుల మొత్తం షేర్ల విలువపై ఎటువంటి ప్రతికూల ప్రభావాన్ని చూపదు. దీని ఉద్దేశం స్టాక్ మార్కెట్‌లో ద్రవ్యతను పెంచడం, చిన్న పెట్టుబడిదారులను జోడించడం.

బోనస్ షేర్లను జారీ చేసిన తర్వాత పతంజలి ఫుడ్స్ మొత్తం వాటా మూలధనం 108.75 కోట్ల షేర్లకు పెరిగింది. కంపెనీ మొత్తం 72.50 కోట్ల బోనస్ షేర్లను ఇచ్చింది. వాటా విషయానికొస్తే జూన్ 30, 2025 నాటికి ప్రమోటర్లు కంపెనీలో 36.70 శాతం వాటాను కలిగి ఉన్నారు. ప్రభుత్వ పెట్టుబడిదారులు 31.17 శాతం వాటాను కలిగి ఉన్నారు. ప్రధాన సంస్థాగత పెట్టుబడిదారులలో 9.14 శాతం, మ్యూచువల్ ఫండ్స్ 1.72 శాతం, భాగస్వాములు 4.56 శాతం వాటాను కలిగి ఉన్నారు. దీనితో పాటు బాబా రాందేవ్ పతంజలి ఆయుర్వేద, ఇతర గ్రూప్ కంపెనీలు కూడా ఈ కంపెనీలో గణనీయమైన వాటాను కలిగి ఉన్నాయి. 2019లో పతంజలి గ్రూప్ రుచి సోయా కంపెనీని కొనుగోలు చేసి, దానికి పతంజలి ఫుడ్స్ అని పేరు మార్చింది.

# సెమీఫైనల్లో సాత్విక్-చిరాగ్..

**తొలి వరల్డ్ టూర్ టైటిల్ దక్కేనా..!**




**హాంకాంగ్:** ప్రపంచ బ్యాడ్మింటన్ ఛాంపియన్‌షిప్‌లో కాంస్యంతో మెరిసిన సాత్విక్ సాయిరాజ్ - చిరాగ్ శెట్టి జోడీ మరో టైటిల్ వేటకు చేరువైంది. ప్రతిష్ఠాత్మక హాంకాంగ్ ఓపెన్ సూపర్ 500 టోర్నీలో ఈ స్టార్ జంట సంచలన ప్రదర్శనతో సెమీఫైనల్‌కు దూసుకెళ్లింది. శుక్రవారం హెూరాహెూరీగా జరిగిన మూడు సెట్ల పోరులో జునైదీ అరిఫ్-రాయ్ కింగ్ యాప్ (మలేషియా)లను చిత్తు చేసింది. దాంతో.. వరుసగా రెండో టోర్నమెంటల్‌లో సెమీస్ బెర్తు కైవసం చేసుకుందీ భారత స్టార్ ద్వయం.

హాకాంగ్ ఓపెన్‌లో సాత్విక్ సాయిరాజ్-చిరాగ్ శెట్టి జోడీ జైత్రయాత్ర కొనసాగిస్తోంది. 42వ ర్యాంక్ జోడీని మట్టికరిపించి క్వార్టర్ ఫైనల్ చేరిన ఈ ద్వయం అదే దూకుడు చూపించింది. బలమైన ఆటాకింగ్‌తో భారత జంటకు చెక్ పెట్టాలని భావించిన జునైదీ అరిఫ్-రాయ్ కింగ్ యాప్‌లకు చుక్కలు చూపించింది. ప్రత్యర్థి ఎత్తుల్ని చిత్తు చేస్తూ తొలి సెట్‌ను సాత్విక్-సాయిరాజ్ 21-14తో కైవసం చేసుకున్నారు.

అయితే.. రెండో సెట్‌లో అటాకింగ్ గేమ్‌తో మలేషియా షట్లర్లు 22-20తో పైచేయి సాధించారు. దాంతో.. మూడో సెట్ ఫలితంపై ఉత్కంఠ నెలకొంది. నిర్ణయాత్మకమైన ఈ సెట్‌లో సాత్విక్-చిరాగ్ జోడీ టాప్ గేర్‌లో ఆడింది. తమదైన శైలిలో దూకుడు కనబరిచి జునైదీ-రాయ్ కింగ్ జంట సెమీస్ ఆశలపై నీళ్లు చల్లింది. ఈ ఏడాది తొలి బీడబ్ల్యూఎఫ్ వరల్డ్ టూర్ టైటిల్ వేటలో ఉన్న ఈ జోడీ శనివారం లిన్ బింగ్ వీ - చెన్ చెంగ్ కౌన్ (చైనీస్ తైపీ)తో తలపడనుంది.

## ప్రాక్టీస్ చేస్తున్న రోహిత్ శర్మ..



**ముంబై:** వన్డే కెప్టెన్ రోహిత్ శర్మ కొంత బ్రేక్ తర్వాత మళ్లీ బ్యాట్ పట్టాడు. నెట్స్‌లో అతను ప్రాక్టీస్ మొదలుపెట్టాడు. ప్రాక్టీస్ సెషన్‌కు చెందిన ఓ వీడియోను తన ఇన్‌స్టా అకౌంట్‌లో పోస్టు చేశాడు. చాంపియన్స్ ట్రోఫీ ఫైనల్ తర్వాత రోహిత్ అంతర్జాతీయ మ్యాచ్‌లు ఆడలేదు. ఐపీఎల్‌లో ముంబై ఇండియన్స్ తరపున అతను ఈ ఏడాది చివరగా క్రికెట్ ఆడాడు. అయితే ఆస్ట్రేలియాతో జరగబోయే వన్డే సిరీస్‌లో మళ్లీ మైదానంలోకి దిగే ఆలోచనలో రోహిత్ శర్మ ఉన్నాడు. ఆ ఉద్దేశంతోనే అతను మళ్లీ బ్యాటింగ్ ప్రాక్టీస్ చేశాడు.

ప్రాక్టీస్ సమయంలో అభిషేక్ నాయర్ అతనికి సహకరించాడు. ఇన్‌స్టాలో రోహిత్ పోస్టు చేసిన వీడియోకు చాలా కామెంట్స్ వచ్చాయి. కానీ అతని భార్య రితిక సాజ్దే భావోద్వేగభరిత కామెంట్ చేశారు. గూజ్‌బంప్స్ వస్తున్నట్లు ఆమె రోహిత్ పోస్టుకు రియాక్ట్ అయ్యారు. దీంతో పాటు కన్నీళ్లతో నిండిన మూడు కంటి ఎమోజీలను కూడా ఆ పోస్టుకు ఆమె యాడ్ చేసింది. అయితే రోహిత్ మాత్రం తన ప్రాక్టీస్ సమయంలో చాలా ఫిట్‌గా ఉన్నట్లు కనిపించాడు. ఛాలెంజింగ్‌గా మారనున్న ఆ వన్డే టూరుకు సిద్ధంగా ఉన్నట్లు రోహిత్ తన ప్రాక్టీస్‌తో చెప్పేశాడు. ఐసీసీ వరల్డ్ టెస్ట్ చాంపియన్‌షిప్ 2025-27 సిరీస్ ప్రారంభానికి ముందే టెస్టు క్రికెట్ నుంచి రోహిత్ శర్మ రిటైర్మెంట్ ప్రకటించిన విషయం తెలిసిందే. 2013 నుంచి 2025 వరకు రోహిత్ 67 టెస్టులు ఆడాడు. దాంట్లో అతను 40.17 సగటుతో 4301 రన్స్ స్కోర్ చేశాడు. 12 సెంచరీలు, 18 ఫిఫ్టీలు ఉన్నాయి.

## 18 ఏళ్లకే వరల్డ్ ఛాంపియన్..

**ఇప్పుడేమో హ్యాట్రిక్ ఓటములు..!**



**న్యూఢిల్లీ:** చెస్ సంచలనంగా పేరొందిన భారత గ్రాండ్‌మాస్టర్ దొమ్మరాజు గుకేశ్ గడ్డుకాలం ఎదుర్కొంటున్నాడు. 18 ఏళ్లకే వరల్డ్ చెస్ ఛాంపియన్‌షిప్ గెలుపొందిన గుకేశ్ మెగా టోర్నీల్లో తీవ్రంగా నిరాశపరుస్తున్నాడు. స్విట్జరాండ్ వేదికగా జరుగుతున్న ఫిడే గ్రాండ్ స్విస్ టోర్నమెంట్‌లో ఈ యంగ్‌స్టర్ ఏకంగా హ్యాట్రిక్ పరాజయాలు మూటగట్టుకున్నాడు. శుక్రవారం ఏడో రౌండ్ మ్యాచ్‌లో పదహారేళ్ల టర్కీ గ్రాండ్‌మాస్టర్ ఎడిజ్ గురెల్ చేతిలో గుకేశ్ కంగుతిన్నాడు.

ఫిడే గ్రాండ్ స్విస్ టోర్నీలో గుకేశ్ పరాజయాల పరంపర కొనసాగుతోంది. తన స్థాయికి తగ్గట్టు ఆడలేకపోతున్న ఈ యువకెరటం వరుసగా అభిమన్యు మిశ్రా(యూఎస్ఏ), నికోలస్ థీయోడరస్ (గ్రీస్) చేతిలో ఓటమి పాలయ్యాడు. ఏడో గేమ్‌లో ఆరంభం నుంచి గుకేశ్, గురెల్ పోటాపోటీగా ఆడారు. అయితే.. 27వ ఎత్తులో ఇద్దరూ పొరపాటు చేశారు. అనంతరం 29వ ఎత్తులో ఇరువురు రాణులను మార్చుకున్నారు.

అప్పటివరకూ ఫోకస్‌గా ఆడిన గుకేశ్ 40వ ఎత్తులో పెద్ద తప్పిదంతో భారీ మూల్యం చెల్లించుకున్నాడు. మ్యాచ్ చేజారగానే బాధను దిగమింగుకుంటూ ప్రత్యర్థికి షేక్‌హ్యాండ్ ఇచ్చాడు గుకేశ్. దాంతో, అతడి ఫామ్‌పై కామెంటేటర్లతో పాటు అభిమానులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. 'ఇంతకూ గుకేశ్‌కు ఏమైంది. కచ్చితంగా ఆడుతున్నది అతడు కాదు' అని మరుసే అష్లే(జమైకా, అమెరికా దిగ్గజం) ఎక్స్ వేదికగా పోస్ట్ పెట్టాడు. ప్రస్తుతం భారత స్టార్ ప్లేయర్ ఖాతాలో మూడు పాయింట్లు ఉన్నాయంతే. ఇకపై టోర్నీలో ముందంజ వేయాలంటే తుదపరి అన్ని మ్యాచులు గెలిచితీరాల్సిందే.

గుకేశ్ వెనకంజలో ఉండగా.. భారత్‌కు చెందిన ప్రజ్ఞానంద, నిహాల్ సరిన్‌లు ప్రత్యర్థులకు చెక్ పెట్టి ఆశలు రేకెత్తిస్తున్నారు. పర్హం మగ్‌సూద్‌లో(ఇరాన్)ను ఓడించిన నిహాల్ జర్మనీకి చందిన మ్యాటిహస్ బ్లుబౌమ్తో సంయుక్తంగా 5.5 పాయింట్లు సాధించాడు. ఇజ్రాయేల్ గ్రాండ్‌మాస్టర్ మాక్జిమ్ రొడ్‌షెటిన్‌ను నిలువరించిన ప్రజ్ఞానంద 4.5 పాయింట్లు సొంతం చేసుకున్నాడు.

## ఆసియా కప్ ప్రమోషన్‌లో పాకిస్థాన్ లోగో మాయం..




**న్యూఢిల్లీ:** ఆసియా కప్‌లో భారత్, పాకిస్థాన్ మ్యాచ్‌కు ఇంకా రెండు రోజులే ఉంది. సెప్టెంబర్ 14న దాయాది జట్లు నువ్వానేనా అన్నట్టు తలపడనున్నాయి. పహల్గాం ఉగ్రదాడి, 'ఆపరేషన్ సిందూర్' తర్వాత ఇరుజట్ల మధ్య జరుగతున్న తొలి మ్యాచ్ ఇది. అయితే.. పాక్‌తో మ్యాచ్‌కు బీసీసీఐ పచ్చజెండా ఊపడాన్ని చాలామంది జీర్ణించుకోలేకపోతున్నారు. మ్యాచ్‌ను బాయ్‌కాట్ చేయాలని డిమాండ్లు చేస్తున్నవారు కొందరైతే.. పాక్ పేరు లేకుండా పోస్టులు పెడుతున్నారు మరికొందరు. ఐపీఎల్ ఫ్రాంచైజీ పంజాబ్ కింగ్స్ సైతం అలాంటి పోస్ట్‌తోనే ప్రస్తుతం వార్తల్లో నిలిచింది.

ఆతిథ్య యూఏఈపై భారీ విజయంతో ఆసియా కప్‌ను ఆరంభించింది భారత జట్టు. గ్రూప్ దశలో సూర్యకుమార్ యాదవ్ సేన ఆడబోయే తదుపరి మ్యాచ్ పాకిస్థాన్‌తోనే. దుబాయ్ ఇంటర్నేషనల్ స్టేడియంలో జరుగబోయే ఈ గేమ్‌పైనే అభిమానులందరి దృష్టి ఉంది. ఈ నేపథ్యంలో భారత్, పాక్ మ్యాచ్ ప్రచారాన్ని పంజాబ్ కింగ్స్ జట్టు వినూత్నంగా చేస్తోంది. పాక్ జట్టు పేరు, ఆ టీమ్ లోగో ముద్రించకుండానే టీమిండియ రెండో మ్యాచ్ అంటూ ఎక్స్‌లో పోస్ట్ పెట్టింది పంజాబ్ యాజమాన్యం.

'ఆసియా కప్‌లో డిఫెండింగ్ ఛాంపియన్ భారత జట్టుకు రెండో మ్యాచ్. లెట్స్ గో' అంటూ టీమిండియా విజయాన్ని కాంక్షించింది పంజాబ్. అయితే.. ఆ పోస్ట్‌లో భారత్ వర్సెస్ పాక్ అని ఉండాలి. కానీ, ప్రత్యర్థి పేరు, లోగో స్థానాన్ని ఖాళీగా ఉంచి పాక్‌పై తమ అయిష్టతను వ్యక్తం చేసింది ఐపీఎల్ రన్నరప్. పంజాబ్‌కు చెందిన ఆటగాళ్లు పాక్‌తో క్రికెట్ వద్దే వద్దని అంటున్నారు.

జలంధర్ వాస్తవ్యుడైన హర్భజన్ సింగ్ దాయాదితో క్రికెట్, వ్యాపారం అన్ని ఆపేయాలని డిమాండ్ చేశాడు. 'భారత్-పాకిస్థాన్ మ్యాచ్ ఎల్లప్పుడూ అభిమానులను ఆకర్షిస్తూనే ఉంటుంది. కానీ, ఆపరేషన్ సిందూర్ తర్వాత పరిణామాలు మారిపోయాయి. దేశంలోని ప్రతి ఒక్కరూ ఇకపై పాక్‌తో క్రికెట్, వ్యాపారం ఏవీ వద్దనుకుంటున్నారు' అని భజ్జీ మీడియాతో వెల్లడించాడు.

# హార్రర్ ప్రాంచైజీ కాంచన 4 వచ్చేస్తుంది..

రాఘవా లారెన్స్ టీం క్రేజీ న్యూస్..!




**టాకీస్:** కోలీవుడ్ నుంచి వచ్చి తెలుగులో కూడా సూపర్ క్రేజ్ సంపాదించుకున్న హార్రర్ ప్రాంచైజీల్లో టాప్‌లో ఉంటుంది కాంచన. రాఘవా లారెన్స్ స్వీయ దర్శకత్వంలో లీడ్ రోల్స్‌లో నటించిన ఈ ప్రాంచైజీ బాక్సాఫీస్ వద్ద నిర్మాతలకు కాసుల వర్షం కురిపించింది. కాగా తెలుగు, తమిళ ప్రేక్షకులకు ఓ వైపు వినోదం అందిస్తూనే.. మరోవైపు గూస్ బంప్స్ తెప్పించేందుకు కాంచన 4 కూడా వచ్చేస్తుంది. కోలీవుడ్ సర్కిల్ కథనం ప్రకారం కాంచన 4 చిత్రీకరణ సగభాగం పూర్తయింది.

రాఘవా లారెన్స్ టీం వీలైనంత త్వరగా కాంచన 4 ప్రొడక్షన్ పనులు పూర్తి చేయ చేస్తున్నట్టు సమాచారం. ఈ చిత్రానికి రాఘ. లారెన్స్ డైరెక్టర్ కమ్ ప్రొడ్యూసర్‌గా కూడా వ్యవహరిస్తున్నాడు. కాంచన 4లో బాలీవుడ్ భామ నోరా ఫతేహి ఫీ మేల్ లీడ్ రోల్‌లో నటిస్తోంది. ఈ మూవీతో కోలీవుడ్ ఎంట్రీ ఇస్తోంది నోరా ఫతేహి. పూజా హెగ్డే, రష్మిక మందన్నా కూడా కాంచన 4లో టీంతో జాయిన్ కాబోతున్నట్టు వార్తలు వస్తుండగా.. దీనిపై అధికారిక ప్రకటన రావాల్సి ఉంది. కాగా కాంచన 3 మిక్స్ రివ్యూస్ వచ్చినప్పటికీ బాక్సాఫీస్ వద్ద సూపర్ హిట్ టాక్ తెచ్చుకుంది.

కాంచన 3 తెలుగులో నాని నటించిన జెర్సీ చిత్రానికి బాక్సాఫీస్ వదదగట్టి పోటీనివ్వడమే కాదు సుమారు 100 కోట్ల వరకు వసూల్లు రాబట్టింది. మరి కాంచన 4 ఎలాంటి రెస్పాన్స్ తెచ్చుకుంటుందనేది ఆసక్తికరంగా మారింది.

# రాజాసాబ్ షూటింగ్ పార్ట్ పూర్తి

నటి మాళవికా మోహనన్ వెల్లడి






**టాకీస్:** పాన్ ఇండియా స్టార్ ప్రభాస్ ప్రస్తుతం ఫుల్ ఫామ్‌లో ఉన్నాడు. వరుసగా భారీ సినిమాలతో బిజీగా మారిపోయిన ఆయన, ఇప్పుడు ఓ వినూత్న కాన్సెప్ట్‌తో ప్రేక్షకుల ముందుకు రానున్నాడు. మారుతీ దర్శకత్వంలో తెరకెక్కుతున్న 'రాజా సాబ్' సినిమా సంక్రాంతికి థియేటర్లలో సందడి చేయడానికి రెడీ అవుతోంది. ఇప్పటి వరకు యాక్షన్, రొమాన్స్, ఫాంటసీ సినిమాల్లో అలరించిన ప్రభాస్, తన కెరీర్‌లో మొదటి సారి హారర్ అండ్ కామెడీ నేపథ్యంలో రూపొందిన సినిమాలో నటిస్తున్నాడు. ఈ సినిమాపై భారీ అంచనాలు నెలకొన్నాయి. ఈ చిత్రంలో మలయాళ బ్యూటీ- మాళవిక మోహనన్ హీరోయిన్‌గా నటిస్తోంది. ప్రభాస్‌తో కలిసి పనిచేయడం తనకు ప్రత్యేక అనుభవంగా మారిందని ఆమె తాజాగా వెల్లడించింది.

ప్రభాస్ చాలా శాంతంగా ఉంటారు. ఆయన వయసు నాకంటే ఎక్కువే అయినా, ఆయనను చూస్తే అలానే అనిపించదు. సహజంగా ఉంటారు. 'రాజా సాబ్'లో మా జంట చాలా బాగా వర్కౌట్ అయిందని ఆమె అన్నారు. ఈ కామెంట్స్ ప్రస్తుతం సోషల్ మీడియాలో వైరల్‌గా మారాయి.అయితే పనిలో పనిగా మూవీకి సంబంధించిన అప్‌డేట్ కూడా వచ్చింది. సినిమా కూడా పూర్తయ్యింది. కొన్ని పాటలను చిత్రీకరించాల్సి ఉందని పేర్కొంది ఈ బ్యూటీ. ప్రస్తుతం మాళవిక చేసిన ఈ కామెంట్స్ సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి. ప్రభాస్ సరసన మాళవికతో పాటు- నిధి అగర్వాల్ మరియు రిద్ధీ కుమార్ కూడా కథానాయికలుగా నటిస్తున్నారు. ముగ్గురు హీరోయిన్లతో వస్తున్న ఈ ఫామిలీ ఎంటర్‌టైనర్‌లో ప్రతి పాత్రకూ ప్రత్యేకత ఉందని యూనిట్ చెబుతోంది. ఈ సినిమాకి థమన్ సంగీతం అందిస్తున్నాడు. అక్టోబర్ 23 ప్రభాస్ బర్త్‌డే సందర్భంగా 'రాజా సాబ్' నుంచి ఫస్ట్ సాంగ్ రాబోతున్నట్లు- బలమైన సమాచారం.



# సోషల్ మీడియాకు దూరంగా అనుష్క

**టాకీస్:** చాలా రోజుల విరామం తర్వాత ఇటీవల 'ఘాటి'తో పలకరించారు అనుష్క. కొన్నేళ్లుగా మీడియాకు దూరంగా ఉంటోన్న ఆమె తాజాగా సోషల్ మీడియాకు కూడా దూరంగా ఉండనున్నట్లు- ప్రకటించారు. సోషల్ మీడియాకు కొంతకాలం బ్రేక్ ఇస్తున్నట్లు- తెలుపుతూ పోస్ట్ పెట్టారు. తానే స్వయంగా లెటర్ రాసి దాన్ని పోస్ట్ చేశారు. సోషల్ మీడియాకు దూరంగా ఉండాలనుకుంటున్నా. ఎప్పుడూ స్క్రోలింగ్ చేసే లైఫ్‌కు దూరంగా.. నిజమైన ప్రపంచానికి దగ్గరగా ఉండాలని నిర్ణయించుకున్నా. త్వరలోనే మరిన్ని మంచి కథలతో మరింత ప్రేమతో మీ ముందుకువస్తాను' అని తాను రాసిన లెటర్‌ను పోస్ట్ చేశారు. ఈ లెటర్ వైరల్ కావడంతో అనుష్క (ఆషరీశ) ఈ నిర్ణయం ఎందుకు తీసుకున్నారా అని అభిమానులు చర్చించు కుంటున్నారు. ఇటీవల వచ్చిన 'ఘాటి' ప్రచారంలోనూ స్వీటి పరోక్షంగా పాల్గొన్నారు. రానా, అల్లు అర్జున్‌లతో ఫోన్‌లో మాట్లాడి సినిమా విశేషాలతో పాటు- కొన్ని ఆసక్తికర విషయాలను పంచుకున్నారు. తాను కొన్ని రోజులుగా ఎక్కడికీ వెళ్లడం లేదని చెప్పారు. ఇంట్లో జరిగే పెళ్లిళ్లకు కూడా హాజరుకావడం లేదన్నారు. త్వరలోనే అందరి ముందుకువస్తానని చెప్పారు. వచ్చే ఏడాది నుంచి వరుస సినిమాలు చేస్తానని అభిమానులకు హామీ ఇచ్చారు. ఇక క్రిష్ జాగర్లమూడి దర్శకత్వంలో అనుష్క ప్రధాన పాత్రలో యాక్షన్ -క్రై-మ్ డ్రామాగా 'ఘాటి' రూపొందింది. భారీ అంచనాల మధ్య ప్రేక్షకుల ముందుకువచ్చిన ఆ చిత్రం మిశ్రమ ఫలితాన్ని అందుకుంది.

# దెయ్యం బ్యాక్ డ్రాప్‌లో మరో మూవీ

బెల్లంకొండ, అనుపమల కిష్కింధపురి

**టాకీస్:** రాఘవ్ (బెల్లంకొండ సాయిశ్రీనివాస్), మైథిలి (అనుపమ) ప్రేమికులు. ఆ ఇద్దరూ మరొక స్నేహితుడు (సుదర్శన్)తో కలిసి ఘోస్ట్ వాకింగ్ పేరుతో హాంటెడ్ హౌసెస్ టూర్స్‌ని నిర్వహిస్తుంటారు. థ్రిల్ కోరుకునే వాళ్లందరినీ కలిపి ఓ పాడుబడిన బంగ్లాల్లోకి తీసుకెళ్లి అక్కడ దెయ్యాలు ఉన్నాయని నమ్మిస్తూ థ్రిల్ పంచడమే ఆ టూర్ ఉద్దేశం. అలా ఓసారి 11 మందితో కలిసి కిష్కింధపురి అనే ఊరి పరిసరాల్లో ఉన్న సువర్ణమాయ అనే రేడియో స్టేషన్‌కి వెళతారు. 1989లోనే పాడుబడిన స్టేషన్ అది. అందులోకి అడుగు పెట్టాక రేడియో నుంచి ఓ వాయిస్ వినిపిస్తుంది. అది దెయ్యంలా మారిన వేదవతి వాయిస్ అని ఆ తర్వాత తెలుస్తుంది. సువర్ణమాయలోకి అడుగు పెట్టిన 11 మందిలో ఎవ్వరినీ వదిలిపెట్టనని వార్నింగ్ ఇస్తుంది వేదవతి.



చెప్పినట్టుగానే వెంటనే ఆ బృందంలో ముగ్గురు చనిపోతారు. ఆ తర్వాత అందులోని ఓ చిన్నారి టార్గెట్ అవుతుంది. అది పసిగట్టిన రాఘవ్ తన ప్రాణాల్ని అడ్డుపెట్టి దెయ్యానికి ఎదురెళతాడు. అసలు ఆ వేదవతి ఎవరు? ఎందుకు దెయ్యంలా మారింది? సువర్ణమాయ స్టేషన్‌తో ఆమెకున్న సంబంధం ఏమిటి? అందులోకి వెళ్లినవాళ్లని ఎందుకు చంపేస్తోంది?అన్నది చిత్ర కథ. హారర్‌తో పాటు-, థ్రిల్లింగ్ అంశాల మేళవింపుతో రాసుకున్న కథ ఇది. ప్రథమార్ధంలో దెయ్యాన్ని చూపిస్తూ భయపెట్టేందుకు.. ద్వితీయార్ధంలో ఆ దెయ్యం వెనకున్న కథని చెబుతూ థ్రిల్‌ని పంచేందుకు ప్రయత్నిస్తుందీ సినిమా. భయపెట్టడం వరకూ ఫర్వాలేదనిపిస్తుంది కానీ, ద్వితీయార్ధంలో థ్రిల్లింగ్ అనుభూతి కాస్త తగ్గింది. అయితే, థియేటర్‌లో ఉన్నంతసేపూ ఆ కథలో చోటు-చేసుకునే మలుపులు ఆసక్తిని రేకెత్తిస్తాయి.

# కొత్తదనంతో వచ్చిన మిరాయ్

**టాకీస్:** 'హను-మాన్'తో భారీ విజయాన్ని అందుకున్న తేజ సజ్జా 'మిరాయ్'తో సూపర్ యోధాగా యాక్షన్ హంగామా చూపించేందుకు సిద్ధమయ్యాడు. 'ఈగల్' తర్వాత కార్తీక్ ఘట్టమనేని తెరకెక్కించిన చిత్రమిది. మంచు మనోజ్ ప్రతినాయకు డిగా నటించడం టీజర్, -ట్రైలర్లు అద్భుతమైన విజువల్స్‌తో ఆకట్టు-కోవడం.. ఈ సినిమాపై ప్రేక్షకుల్లో భారీ అంచనాలేర్ప డ్డాయి. సామ్రాట్ అశోక్ కళింగ యుద్ధం గెలిచాక.. జరిగిన విధ్వంసాన్ని తలచుకుని పశ్చాత్తాపడతాడు. ఆ వినాశనానికి తనలోని దైవశక్తే ఓ కారణమని భావించి.. ఆ శక్తిని తొమ్మిది గ్రంథాల్లో నిక్షిప్తం చేసి.. వాటి రక్షణ బాధ్యతను తొమ్మిది మంది యోధుల చేతుల్లో పెడతాడు. కొన్ని శతాబ్దాల తర్వాత ఆ గ్రంథాలపై దుష్టశక్తి మహావీర్ లామా (మంచు మనోజ్) కన్నుపడుతుంది. అతను తనకున్న తంత్ర



శక్తులతో ప్రపంచంలోని వివిధ ప్రదేశాల్లో ఉన్న ఎనిమిది మహిమాన్విత గ్రంథాల్ని.. దానికి రక్షణగా ఉన్న యోధుల్ని తుద ముట్టించి హస్తగతం చేసుకుంటాడు. అయితే అతను కోరుకున్నట్లుగా అమరత్వాన్ని సాధించి.. ప్రపంచాన్ని శాసించే శక్తిగా ఎదగాలంటే తొమ్మిదో గ్రంథం అవసరమవుతుంది. కానీ, అమరత్వానికి సంబంధించిన ఆ గ్రంథాన్ని సొంతం చేసుకోవడం అంత తేలిక కాదు. ఎందుకంటే దానికి రక్షణగా ఉండేది అంబిక. మహావీర్ రూపంలో ప్రపంచానికి ఎదురు కానున్న ముప్పును ముందే జ్ఞాన దృష్టితో చూసిన అంబిక.. అతన్ని ఎదుర్కొనేందుకు తనకు పుట్టిన బిడ్డ వేద (తేజ సజ్జా)ను పసికందుగా ఉన్నప్పుడే దూరం చేసుకుంటుంది.

Printed , Published & Owned by GADDAMEDI BALARAJU, Printed, at YAGNA PRINTERS AND PUBLICATIONS # 18-105/4,Opp:SBI,Hanumanpet,Malkajgiri (M),Medchal-Malkajgiri District,Telangana State-500047 And Publishedat H. NO: 4-54-246,.Maqdum Nagar, Jagathgirigutta,IDA Jeedimetla,Balanagar Township,Medchal-Malkajgiri ,Telangana-500037 Editor : GADDAMEDI BALARAJU Cell: 9848802025 RNI.No. APTEL/2009/29786.